





పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

అమరవీరుల సంస్మరణ దినంలో ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజ రక్షణ, ప్రజా శ్రేయస్సు, దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల వీరోచిత త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ సమీపంలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల కుటుంబ సభ్యులతో కలసి ఎస్పీ పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టిన వారందరికీ వందనాలన్నారు. అమరవీరుల కుటుంబసభ్యులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. పోలీసులు సమాజం కోసం నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. వారి కృషి, కుటుంబ సభ్యుల త్యాగాలు ఎంతో విలువైనవన్నారు. ఎండ, వాన, రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజల భద్రత కోసం కృషి చేస్తున్న ప్రతీ పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి, ఏ.హనుమంతు, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, వెస్ట్ డీఎస్పీ అరవింద్, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఎస్బీ సీఐ శ్రీనివాస్, సీఐలు కిశోర్, వీరయ్యచౌదరి, సింగయ్య, ఆర్ఐలు సురేష్, శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


గుంటూరు : అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

హెల్త్.. వెల్త్.. హ్యాపీనే లక్ష్యం

పోలీసుల గౌరవం పెంచుతాను

- పోలీసులది ఉద్యోగం కాదు నిస్వార్థ సేవ
- అమరవీరుల సంస్మరణ దినంలో సీఎం చంద్రబాబు
- మంగళగిరి బెటాలియన్‌లో అట్టహాసంగా కార్యక్రమాలు

మంగళగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హెల్త్, వెల్త్, హ్యాపీనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ గ్రౌండులో మంగళవారం అట్టహాసంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా తొలుత ముఖ్యమంత్రి పోలీసు మృతవీరుల స్మారక స్థూపానికి నివాళులను అర్పించారు. ఆ తర్వాత పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించి, అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్, శాంతిభద్రతల విభాగం అడిషనల్ డీజీ మధుసూదనరెడ్డిలతో ముఖ్యమంత్రి కలిసి సందర్శించారు. బెటాలియన్‌కు వచ్చిన సీఎం చంద్రబాబుకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో పోలీసులను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న పోలీసులంటే తనకెప్పుడు గౌరవమేనని చెప్పారు. పోలీసుల గౌరవాన్ని పెంచడంతోపాటు వారి కుటుంబాల సంక్షేమ బాధ్యతలను తమ ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. పోలీసుల త్యాగాలను, బలి దానాలను జాతి గుర్తుంచుకుంటూ వారి నుంచి స్ఫూర్తిని పొందుతుందని చెప్పారు. పోలీసులు చేసేది ఉద్యోగం అనేకన్నా నిస్వార్థ సేవ అనడం సరైనదని చంద్రబాబు చెప్పారు. ఏపీ పోలీసు అంటే ఓ బ్రాండ్ అని, దానికి మరింత వన్నె తెచ్చేలా పనిచేయాలని కోరారు. ప్రస్తుత తరుణంలో పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాజిక సేవలో మానవత్వాన్ని చూపుతూనే అక్రమార్కులు, తప్పుడుపనులు చేసేవారి విషయంలో పోలీసు అంటేనే భయం కలిగేలా కఠినంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. సైబర్ నేరాలకు పాల్పడాలంటే భయపడేలా పోలీసులు సాంకేతికతలో అప్‌డేట్ అవుతుండాలన్నారు.


అమర వీరులకు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

దీపావళి.. ఆనందకేళి

- వెలుగులతో నిండిన పండుగ
- టపాకాయలు కాల్చి చిన్నాపెద్ద సంబరం

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సోమవారం దీపావళి పండుగను ప్రజలు అట్టహాసంగా జరుపుకున్నారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా దీపావళిని ఓ వేడుకగా నిర్వహించుకున్నారు. మహిళలు దీపాలు, పూలతో సుందరంగా అలంకరించగా లోగిళ్లు వెలుగులు విరజిమ్మాయి. చిన్నారులు ఉదయం నుంచే టపాకాయలు కాలుస్తూ సందడి చేశారు. రంగు రంగుల బాణసంచా వెలుగులతో పట్టణాలు, పల్లెలు నిండిపోయాయి. బాణసంచా వెలుగులు కనువిందు చేశాయి. జిల్లా అంతటా దీపావళి శోభ సంతరించుకుంది. టపాసుల మోతలతో వీధులు హోరెత్తిపోయాయి. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ టపాకాయలు పేలుస్తూ ఆనందంలో మునిగితేలారు. దీపావళి సందర్భంగా ఇంటింటా.. వ్యాపార సంస్థల్లో లక్ష్మీ పూజలు ఘనంగా జరిగాయి. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గృహాలు, వ్యాపార సంస్థలు రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. జిల్లాలో ఎక్కడా ప్రమాద ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, ఆనందోత్సాహాల నడుమ దీపావళి పర్వదినం ముగిసింది.



నేటి నుంచి కార్తీక మాసం

అమరేశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బుధవారం నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాసం పురస్కరించుకుని ప్రథమ ఆరామమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నదీతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలిగించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఈ క్రమంలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలను ఏర్పాటు చేసి ఎండ నుంచి రక్షణకు ఆలయ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేశారు. స్నానఘాట్ వద్ద మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలికంగా షెడ్లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన గాలిగోపురంతో పాటు ఉపాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

చెరువుల్లా ప్రభుత్వ భూములు

పేరేచర్లలో ఆగని అక్రమ మైనింగ్


గ్రావెల్ తరలించగా ఏర్పడిన గుంతలు


రాత్రి గ్రావెల్ తరలింపు

మేడికొండూరు అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అవి ప్రభుత్వ భూములు.. గ్రావెల్ మాఫియా కన్నేయడంతో అవి చెరువుల్లా మారిపోతు న్నాయి. రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను టిప్పర్లతో తరలించేస్తున్నారు. దీంతో తెల్లారేప్పటికి నిక్షేపంలా ఉన్న భూములు అగాధాల్లా మారుతున్నాయి. యథేచ్ఛగా గ్రావెల్ తరలిపోతున్నా.. ప్రభుత్వ భూములను అక్రమంగా తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడికొండూరు మండలం పేరేచర్ల పంచాయతీ పరిధిలో కొండల్లో అక్రమ మైనింగ్ ఆగడం లేదు. శనివారం నుంచి సోమవారం వరకు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. దీంతో అటవీ ప్రాంతాన్ని ఆనుకుని పేరేచర్లలో సర్వే నెంబరు 550లో నిషేధిత భూమిలో అక్రమార్కులు గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని బెదిరిస్తున్నారు. అనుమతులు ఉన్నాయని చెప్తూ రాత్రి వేళల్లో తవ్వకాలపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. లారీ గ్రావెల్‌ను రూ.8 వేలకు విక్ర యిస్తున్నారని సమాచారం. అక్రమార్కులకు అధికారులు అండదండలు ఉన్నాయని ఈ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారినా గ్రావెల్ తవ్వకాలు ఆగడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికే కైలాసగిరి, కొండల చెరువు ప్రాంతాల్లోని భూములు చెరువులుగా మారాయి. అక్రమ తవ్వకాలతో ఆ ప్రాంతాల్లోని మెరక భూములు 20 నుంచి 30 అడుగుల లోతు చెరువులుగా మారిపోయాయి. ఇప్పటికైనా అధికారులు అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. తన పొలానికి సమీపంలోని సర్వే నెంబరు 550లో అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని రామినేని శ్రీనివాసరావు మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.


దీపావళి సందర్భంగా గుంటూరు అరండల్‌పేట అష్టలక్ష్మి దేవాలయంలో అమ్మవారిని 21 లక్షల రూపాయలతో అలంకరించారు.

ఒకే రోజున 42,500 మంది ప్రయాణం



గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగని స్వస్థలాల్లో జరుపుకునేం దుకు వేల మంది రైళ్లలో ప్రయాణించారు. శనివారం ఒక్క రోజే గుంటూరు రైల్వే జంక్షన్‌లో విపరీతమైన రద్దీ ఏర్పడింది. దాదాపుగా 42,500 మంది ప్రయాణికుల ఆ ఒక్క రోజే వివిధ రైళ్లలో ప్రయాణించారు. దీంతో స్టేషన్ లోని టిక్కెట్ కౌంటర్లు, వెయిటింగ్ హాల్స్ హోల్డింగ్ ఏరియాలు జనసంద్రంగా మారాయి. ఈ రద్దీని ముందుగానే అంచనా వేసిన రైల్వే శాఖ అందుకు తగిన ఏర్పాట్లు చేసి ప్రయా ణికులు ఇబ్బంది పడకుండా చూసింది. ప్రయా ణికులు రైళ్లలో ఎక్కేంత వరకు ఆర్‌పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షించారు. ఒకటి, రెండు నిమి షాల హోల్డింగ్ ఉన్న రైళ్లను ఐదు నుంచి 10 నిమిషాల పాటు హోల్డింగ్ చేసి ప్రయాణికులు బోర్డింగ్ చేసేందుకు సహకరించారు. రద్దీ నేపథ్యంలో డివిజన్ ఆఫీసులో సెంట్రలైజ్డ్ వార్ రూం ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫాంలు, సర్క్యులేటింగ్ ఏరియాలు, ప్రవేశ, నిష్క్రమణ పాయింట్ల వద్ద నిరంతరం సీసీ టీవీ నిఘా ద్వారా పర్యవేక్షించారు. ప్రయాణ డిమాండ్‌ను తీర్చడానికి గుంటూరు రైల్వే స్టేషన్ ద్వారా 140 రెగ్యులర్ రైళ్లతో పాటు 40 టీవోడీ(ట్రైన్ ఆన్ డిమాండ్) సర్వీసులను నడిపింది.

నిర్లక్ష్యం నోటీసులు

పల్నాడు జిల్లాలో అత్యధికం..

అక్టోబరు నెలకు సంబంధించి పెన్షన్ల కార్యక్రమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులు రాష్ట్రంలో పల్నాడు జిల్లాలో అత్యధికంగా ఉన్నారు. పల్నాడు జిలాలో 79 మంది, గుంటూరు జిల్లాలో 57 మంది, బాపట్ల జిల్లాలో 17 మంది పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా ఉద్యోగులకు ఆదేశాలు అందాయి. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు.

- పింఛన్ల పంపిణీలో అలసత్వంపై చర్యలు
- సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం కన్నెర్ర
- మూడు జిల్లాల్లో 153 మందికి షోకాజ్ నోటీసులు



గుంటూరు సిటీ, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఒకటో తేదీన ఉదయాన్నే, ఆ రోజు సెలవు అయితే ముందు రోజునే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ మొత్తం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పంపిణీ బాధ్యత సచివాలయ ఉద్యోగులది. అయితే కొందరు ఉద్యోగులు ఇది తమ పని కాదని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా పలువురు పట్టించుకోకుండా తమ ధోరణిని వీడటంలేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం విధుల్లో నిర్లక్ష్యంపై కన్నెర్ర చేసింది. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర డైరెక్టర్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నెల 1న ఉదయం 7 గంటలకు పెన్షన్ పంపిణీ ప్రక్రియను ప్రారంభించని వారితో పాటు, లబ్ధిదారులను కార్యాలయానికి పిలిపించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ లెక్కన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి 153 మంది ఉద్యోగులపై చర్యలకు రంగం సిద్ధం చేశారు.

బహిష్కరించామని చెప్పారు..

తమ డిమాండ్ల పరిష్కారం కోసం సచివాలయ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే పెన్షన్స్ పంపిణీ కార్యక్రమం మాత్రం యథావిధిగా నిర్వహించాలని నిర్ణయించారు. కొన్ని ఉద్యోగ సంఘాలు మాత్రం పెన్షన్లు పంపిణీ నిలుపుదల చేస్తే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావచ్చని చెప్పింది. ఈ సంఘాల నేతల ఉచ్చులో కొందరు సచివాలయ ఉద్యోగులు చిక్కుకున్నారు. పింఛన్ల పంపిణీ సాఫీగా జరగాలని అధికారులు హెచ్చరిక జారీ చేసినా పట్టించుకోలేదు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం సహా పలు ప్రాంతాల్లో కార్యాలయం వద్దకు వచ్చి పెన్షన్లు తీసుకోవాలని మైకుల్లో ప్రచారం చేయించారు. ఇలాంటి వ్యవహారాలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. దీంతో బాధ్యులైన ఉద్యోగులపై చర్యలకు ఆదేశించింది.

నకిలీ బంగారం ముఠా ఆటకట్టు

- ట్రాప్.. కర్నాటకకు చెందిన ఇద్దరి అరెస్టు
- రూ.7 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇస్తామంటూ కర్నాటకకు చెందిన ఓ ముఠా చేస్తున్న మోసాలను అరండల్‌పేట పోలీసులు గుర్తించారు. నకిలీ బంగారం అంటగట్టి కొరిటెపాడుకు చెందిన దంపతులను రూ.12 లక్షలకు మోసగించిన ముఠాలో ఇద్దర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు నిందితులను మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. కర్నాటక రాష్ట్రం బళ్లారి పరిధిలోని విట్లాపురం పంచాయతీకి చెందిన గుత్తి జంబు నాద్(ఎ4), వెంకటేష్ (ఎ5) మరో ముగ్గురు కలిసి ఓ ముఠాగా ఏర్పడి బంగారం పేరుతో మోసాలు చేస్తున్నారు. ఈ ముఠాకు చెందిన వారు ఈ నెల 15న గుంటూరులోని కొరిటెపాడు ప్రాంతానికి చెందిన దంపతులకు ఫోన్ చేసి తవ్వకాల్లో దొరికిన బంగారం తమ వద్ద ఉందని, తక్కువ ధరకు ఇస్తామని నమ్మించారు. తొలుత చిన్న బంగారపు ముక్క ఇవ్వగా దంపతులు పరీక్షించి అసలు బంగారం కావడంతో ముఠాను నమ్మి బళ్లారికి వెళ్లారు. అక్కడ వారి నుంచి రూ.12 లక్షల తీసుకుని రాగి - జింక్ మిశ్రమంతో కూడిన అర కేజీ నకిలీ బంగారు ముక్కలను దంపతులకు ఆ ముఠా ఇచ్చింది. ఇంటికి వచ్చి వాటిని పరీక్షించుకోగా నకిలీ బంగారమని తెలిసి దంపతులు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఆరోగ్యరాజు, ఎస్ఐ సుబ్బారావు, పోలీస్ సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. వెతు కుతున్న తీగ కాలికి తగిలినట్టుగా ఈ ముఠా కొరిటెపాడుకు చెందిన బాధిత దంపతులకు తెలిసిన వారినే మోసం చే సేందుకు యత్నించింది. పోలీసులు ముఠాకు ట్రాప్ వేసి గుంటూరుకు పిలిపించారు. దీంతో జంబునాద్, వెంకటేష్ లను అరెస్టు చేసి వారి నుంచి 7 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ముగ్గుర్ని త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసిన సీఐ, ఎస్ఐ లతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తోన్న డీఎస్పీ అరవింద్, సీఐ ఆరోగ్యరాజు, వెనుక నిందితులు

పెదకాకాని శివాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లు

పెదకాకాని, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ మంగళవారం తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తుల రద్దీ దృష్ట్యా ఆది, సోమవారాలతో పాటు పౌర్ణమి రోజులలో స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలకు అనుమతించట్లేదని తెలిపారు. ఆలయంలో ప్రతి రోజు మహాన్యాసపూర్వక రుద్రజప, రుద్రహోమ, ఏకాథ రుద్రాభిషేకాలు, రుద్రహోమం జరుగుతాయని చెప్పారు. అలాగే ప్రతి శుక్రవారంతో పాటు పౌర్ణమి రోజులలో చండీ హోమం, కేధారేశ్వరస్వామి వ్రతం, అష్టోత్తర పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. నిత్య పరోక్షసేవ, అభిషేక పథకముకు రూ.వెయ్యి చెల్లించి పాల్గొనే భక్తులకు కార్తీకమాసం అనంతరం స్వామి ప్రసాదముగా శేషవస్త్రం, పంచకజ్జాయ ప్రసాదం వారి చిరునామాలకు పోస్టు ద్వారా అందజేస్తామని చెప్పారు. కార్తీకమాసంలోని ఆది, సోమవారాలు, పౌర్ణమి రోజు మినహా ఇతర రోజులలో ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామి దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. కార్తీకమాసాన్ని పోలీసు, అగ్నిమాపక, వైద్య, విద్యుత్, గ్రామపంచాయితీ తదితర శాఖల సహకారంతో విజయవంతంగా పూర్తి చేస్తామని ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

దీపావళి వేడుకల్లో నారా భువనేశ్వరి

తాడేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలోని చిగురు చిల్డ్రన్స్ హోమ్‌లో అనాథ పిల్లలతో కలసి సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సోమవారం రాత్రి దీపావళి వేడకల్లో పాల్గొన్నారు. అక్కడ ఉన్న పిల్లలకు టపాసులు, స్వీట్లు పంచడమే కాక వారితో కలిసి టపాసులు కాల్చి వారికి స్వయంగా భోజనం వడ్డించారు. పిల్లలతో ముచ్చటించి వారి





పిల్లలతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న భువనేశ్వరి

బాగోగులు తెలుసుకున్నారు. 90 మంది ఉండే ఆ చిల్డ్రన్స్ హోమ్‌లో దాదాపు గంట సమయంపాటు నారా భువనేశ్వరి పిల్లలతో గడిపి వారితో ఫోటోలు దిగి పిల్లలను ఆశీర్వదించారు.

రేపటి నుంచి బిలియర్డ్స్ టోర్నమెంట్

● పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్లబ్ పాలకవర్గ ప్రతినిధులు బ్రహ్మేశ్వరరావు, యాగంటి దుర్గారావు

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఎల్‌వీఆర్ క్లబ్‌లో గురువారం నుంచి ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పురుషుల టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నవంబరు 3వ తేదీ వరకూ ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నమెంట్ కోసం ఎల్‌వీఆర్ క్లబ్‌లోని బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ కాంప్లెక్సులో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు చేశారు. టోర్నమెంట్ పోస్టర్‌లను ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ అధ్యక్షుడు షైనేని బ్రహ్మేశ్వరరావు, కార్యదర్శి యాగంటి దుర్గారావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ పోటీలను ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరిలో హరియాణాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. బిలియర్డ్స్ విభాగంలో 38 ఎంట్రీలు, స్నూకర్స్ విభాగంలో 215 ఎంట్రీలు రిజిష్టర్ అయ్యాయని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంట్రీలు అత్యధికంగా నమోదవడంతో ఈ టోర్నమెంట్‌కు మరింత ప్రాధాన్యమేర్పడిందని నిర్వాహకులు పేర్కొన్నారు. 1987లో ఎల్‌వీఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో గుజరాత్‌కు చెందిన గీత్ సేత్ పాల్గొని 147 పాయింట్లు చేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించాడని, ఈ క్లబ్ నిర్వహించిన పోటీల్లో అంతర్జాతీయ క్రీడాకారులు అశోక్ శ్యాండిల్య, పంకజ్ అద్వాని, మనోజ్ కొఠారి, అరవింద్ సవూర్, ఓ.బి.అగర్వాల్ తదితరులు పాల్గొని క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చారని చెప్పారు. ఈ టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శిగా పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్), ఉపాధ్యక్షులు వణుకూరి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఏల్చూరి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాసరావు, టోర్నమెంట్ నిర్వాహక అధ్యక్షులుగా జి.స్వరాజ్యరావు, ఉపాధ్యక్షులుగా టి.పాండురంగారావు, సంయుక్త కార్యదర్శిగా వి.బాలాజీ సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేశారు. ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ కార్యదర్శి వి.సుశీల్, అధ్యక్షుడు ఇంద్రనీల్ ఈ పోటీలలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సహకారాన్ని అందిస్తారని నిర్వాహకులు తెలిపారు.

24న ఇంజనీరింగ్ 'సాంకేతిక సదస్సు

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న పేరేచర్ల ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. లక్ష్మీపురంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించడం కోసం నిర్వహించే ఈ సదస్సులో మైక్రోసాఫ్ట్ ప్రతినిధి రాజీవ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని చెప్పారు. సాంకేతికత రంగంలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పిస్తామని, కృత్రిమ మేథ (ఏఐ), డేటా సైన్స్ వంటి ఆధునిక అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యలో చేపట్టాల్సిన మార్పులు, విద్యార్థులకు నేర్చాల్సిన అంశాలపై చర్చ ఉంటుందని ఆలపాటి చెప్పారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం నాయకులు కోయ సుబ్బారావు మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులను స్వాగతించాలన్నారు. ఈ దిశగా మైక్రోసాఫ్ట్ ఇండియా సంస్థ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఉన్నత విద్యా మండలితో పాటు జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఇంజనీరింగ్ కళాశాల నుంచి ప్రతినిధులు ఈ సదస్సుకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుర్ర శరత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు పాల్గొన్నారు.

వైసీపీ డీఎన్ఏలోనే శవరాజకీయాలు

● జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె ధ్వజం

గుంటూరు మెడికల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కులాల మధ్య చిచ్చుపెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు వైసీపీ శవ రాజకీయాలకు పాల్పడుతోందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు విమర్శించారు. శవరాజకీయాలు చేయడం వైసీపీ డీఎన్ఏలోనే ఉందని ఆయన దుయ్యబట్టారు. లాడ్జి సెంటర్‌లోని



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలంలోని దారకానిపాడు గ్రామంలో జరిగిన దుస్సంఘటనను ఎవరూ క్షమించకూడదని అన్నారు. కానీ దాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయాలని, కుల గొడవలు పెట్టాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. గతంలో వైసీపీ దళితులు, బీసీలు, ఇతర కులాలపై చేసిన దాష్టీకాలు అన్నీ ఇన్నీ కావని, అధికారం కోల్పోయేసరికి తమకు అలవాటైన శవరాజకీయాలు చేస్తోందని విమర్శించారు. తాడేపల్లి నుంచి విడతల వారీగా వైసీపీ నాయకులను పంపి రాష్ట్రంలో అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ సీనియర్ నాయకుడు చందు సాంబశివరావు మాట్లాడుతూ జరిగిన హత్యను ఎవరూ సమర్థించబోరని అన్నారు. చట్ట ప్రకారం నిందితులకు శిక్ష పడుతుందని, బాధితులకు రావాల్సిన నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నాయకులు అడపా మాణిక్యాలరావు, శిఖా బాలు, చట్టాల త్రినాథ్, నక్కల వంశీ, మధులాల్, లింగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

తుళ్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన దొండపాడు సీడ్ యాక్సెస్ రోడ్డు మీద జరిగింది. అమరావతి మండలం నె మలికల్లు గ్రామానికి చెందిన తొరతి గోపి (35) బతుకు తెరువు కోసం కూలీ పనులు చేసుకుంటూ తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామంలో ఉంటున్నాడు. మంగళవారం వడ్డమాను పొలంలో పనిచేస్తున్న వారికి క్యారేజీ ఇవ్వడానికి వెళుతున్న క్రమంలో సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్ వద్ద టిప్పర్ అతడి బైకును ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడకక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం గోపి మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

పొన్నూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఆర్టీసీ బస్సు డిపోలో బస్సు ఢీ కొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. పొన్నూరు ఆర్టీసీ బస్సు డిపోలో కొంతకాలంగా ఓ 70 ఏళ్ల వృద్ధురాలు వేరుశనక్కాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఆమె ఆర్టీసీ డిపో ఎంట్రన్స్ వద్ద ఉండగా డిపోలోకి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దాంతో తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో అర్బన్ సీఐ వీరానాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధురాలి మృతదేహాన్ని నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి శాంథోమ్ కరుణా నిలయం నిర్వాహకుల సహకారంతో తరలించారు.

ఎల్ఎల్‌బీ పరీక్షా ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన మూడేళ్ల ఎల్ఎల్‌బీ నాలుగు, ఐదు, ఎనిమిది సెమిస్టర్లు, ఐదేళ్ల కోర్సులో నాలుగో సెమిస్టర్‌కు చెందిన పరీక్షా ఫలితాలను మంగళవారం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. వచ్చే నెల 3వ తేదీ వరకు పున:మూల్యాంకానానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఎల్ఎల్‌బీ మూడేళ్ల మొదటి సెమిస్టర్, ఐదేళ్ల ఐదో సెమిస్టర్ రీవ్యాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేశామన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన డిప్యూటీ మేయర్ సజీల తదితరులు

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందిస్తాం

- తూర్పు ఎమ్మెల్యే నసీర్
- పైపులైన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందిస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. ప్రగతి నగర్‌లో మంగళవారం ఆయన రూ.40 లక్షలతో పైపులైన్లు, కొండయ్య కాలనీలో రూ.60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రగతి నగర్ గత ప్రభుత్వంలో అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిందని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతి నగర్‌పై దృష్టి సారించామని చెప్పారు. ఇక్కడ 18 లైన్లకు కేవలం రెండు బోర్లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం అమృత్ పథకంలో భాగంగా రూ.40 లక్షలతో మంచినీటి పైపులైన్లు నిర్మించబోతున్నామని చెప్పారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించనున్నామని తెలిపారు. వీటితోపాటు రోడ్ల నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తామని, నిధులు కూడా మంజూరయ్యాయని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జీవో నంబరు 30 ద్వారా ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల నివాసాలను రెగ్యులరైజేషన్ చేయనున్నామని తెలిపారు. ప్రగతి నగర్‌లో ఉన్న 840 మంది పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. తూర్పు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చదిద్దడమే లక్ష్యమని తెలిపారు.

పోలీసు అమరుల త్యాగం చిరస్మరణీయం

ప్రజాస్వామ్య పరిరక్షణే పరమావధిగా, సమాజ శ్రేయస్సే ఊపిరిగా తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించే పోలీసు అమర వీరుల త్యాగం చిరస్మరణీయమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని పోలీసు అమవీరుల స్తూపం వద్ద ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ప్రశాంతంగా నిద్రపోతున్నామంటే, పోలీసులు తాము నిద్రలేని రాత్రులు గడిపి తమను రక్షిస్తుంటారని తెలిపారు. అసాంఘిక కార్యక్రలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రతినిత్యం విధి నిర్వహణలో తలమునకలవుతారని కొనియాడారు. సమాజం కోసం అహర్నిశలు శ్రమించే పోలీసులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసుల గౌరవాన్ని కాపాడుతున్నామన్నారు. మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జోసెఫ్ సుధీర్ బాబు

డీఏ జీవోను వెంటనే సవరించాలి

- ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్ బాబు

గుంటూరు విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాలతో మంత్రివర్గ సబ్ కమిటీ ముఖ్యమంత్రి స్థాయిలో పలు విడతలుగా చర్చించి సోమవారం విడుదల చేసిన జీవో నెంబర్ 60, 61లను వెంటనే సవరించాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కంకరగుంటలోని ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రితో చర్చల తర్వాత ఉద్యోగులకు దీపావళి కానుకగా డీఏ వస్తుందని ఆశపడ్డారు కానీ ఆర్థిక శాఖ విడుదల చేసిన జీవోలలో ఉద్యోగులకు చెల్లించవలసిన డీఏ బకాయిలను పదవి విరమణ అనంతరం చెల్లిస్తామని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే ఈ జీవోలలో సీపీఎస్ ఉద్యోగుల గురించి కనీసపు సమాచారం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు షేక్ బాజీ, వై.శ్యాంబాబు, జి.జోజప్ప, పి.దిబ్బయ్య, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ జారీ చేసే విషయంలో విడుదల చేసిన జీవోలను సరి చేయాలని నోబెల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.హైమారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదవి విరమణ తర్వాత డీఏ చెల్లిస్తామని జీవోలో ప్రకటించడం తగదన్నారు. సీపీఎస్ ఉద్యోగుల విషయం ప్రస్తావించకపోవడం, విశ్రాంత ఉద్యోగుల గురించి స్పష్టమైన ప్రకటనలేదని వెంటనే జీవోను సవరించి విడుదల చేయాలని అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరాజు, హైమారావు కోరారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి : యూటీఎఫ్

గుంటూరు (విద్య), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 1, 2 కేటగిరి ప్రాంతాల్లోని పాఠశాలలకు, ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్ విజ్ఞప్తి చేశారు ఈ మేరకు డీఈవో సీవీ రేణుకకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. డీఎస్సీ అభ్యర్థులకు ఖాళీలు చూపకపోవడం వల్ల కేటగిరి 1, 2 హైస్కూల్స్‌లోని విద్యార్థులకు నష్టం జరుగుతుందని, ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం.గోవిందు, బి.ప్రసాద్ ఆడిట్ కమిటీ సభ్యుడు కే.ప్రేమ్ కుమార్, కార్యవర్గ సభ్యులు జబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

లూలుకి కేటాయించిన భూములను రద్దు చేయాలి

- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : లూలు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు విశాఖపట్నంలో బీచ్ రోడ్డులో హార్బర్ పార్క్‌లో కేటాయించిన 13.74 ఎకరాలు, విజయవాడ నడిబొడ్డులో ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన 4.15 ఎకరాల భూమిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మంగళవారం డిమాండ్ చేశారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రంలో లూలు సంస్థ దాదాపు 4 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమౌతుందని, గుజరాత్‌లో లూలు హైపర్ మార్కెట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, సూరత్‌లో ఎగుమతులను ప్రోత్సహించే కార్యక్రమాలకు ఆ సంస్థ సంసిద్ధతను వ్యక్తం చేసినా గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఒక సెంటు భూమిని కూడా కేటాయించలేదన్నారు. లూలు సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో వెయ్యి కోట్ల రూపాయలు విశాఖ, విజయవాడలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధపడితే వెయ్యి కోట్ల రూపాయలకు పైగా విలువ కలిగిన భూములను దారాదత్తం చేస్తుందని వివరించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం గత ఉత్తర్వులను రద్దు చేసి గుజరాత్ మాదిరిగా బహిరంగంగా వేలం వేసి భూములను కేటాయించాలన్నారు.

అంతరాయం లేని సాగునీటి సరఫరా జరగాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశాలు



జలవనరుల శాఖ అధికారులతో సమీక్షిస్తోన్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగునీటి కాలువలు పరిధిలోని పంట పొలాలకు నీరు సక్రమంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ మంగళవారం జలవనరుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సాగునీటి కాలువలు కింద ఉన్న తాగునీటి చెరువులను నింపుటకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలోని భారీ సాగునీటి కాలువలు కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ, గుంటూరు ఛానల్ కెనాల్స్ నాగార్జున సాగర్ ప్రాజెక్టు, సత్తెనపల్లి, లింగాయపాలెం బ్రాంచ్ కాలువల పరిధిలోని సాగు భూముల విస్తీర్ణం, వరదనీటి డ్రెయిన్ల వివరాలను మ్యాప్‌లు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలువల నిర్వహణ, మరమ్మతులు, అభివృద్ధికి మంజూరు చేసిన పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి వేగవంతంగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుంటూరు ఛానల్ అభివృద్ధి, విస్తరణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి పనులు ప్రారంభించా లన్నారు. కెనాల్స్‌లో పూడికతీత, నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా నిరంతరం అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, ఈఈ రమేష్, డ్రెయినేజ్ విభాగం డీఈ ధనలక్ష్మి, ఏఈలు పాల్గొన్నారు.



పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

- జ్ఞాపికలు అందించి సమస్యలు అడిగి తెలుసుకున్న ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ కుటుంబ సభ్యుల త్యాగాల ఫలితంగానే, పోలీసులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించగలుగుతున్నారన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేసి, ధైర్యంగా ఉండాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి (అడ్మిన్), ఏ. హనుమంతు, ఆర్ఐలు సురేష్, శ్రీహరి రెడ్డి, శివ రామకృష్ణ , పోలీసులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులకు విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నివాళులు

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని మంగళవారం మంగళగిరి ఏపీఎస్పి ఆరో బెటాలియన్‌లో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక స్తూపం వద్ద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ డీజీపీ డాక్టర్ ఎం.మాలకొండయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఐజీ ఏ.రవిచంద్ర, మాజీ అడిషనల్ ఎస్పీ, ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, కోశాధికారి డాక్టర్ కె వి నారాయణ పుష్పగుచ్ఛం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల వీరోచిత త్యాగాలను ఎప్పటికీ మరువలేమన్నారు.

మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో...

దేశంలో ప్రజల ధన, మాన, ప్రాణాల కోసం నిరంతరం రక్షణగా నిలుస్తోన్న పోలీసుల సేవలు చిరస్మరణీయమైనవని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో నగరంపాలెంలో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ పలువురు నాయకులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోళ్ళ అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశ సేవలో భాగంగా అమరులైన పోలీసు అమర వీరులకు మాల మహానాడు జాతీయ, రాష్ట్ర కమిటీలు సగర్వంగా నివాళుల ర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి పిల్లి మేరీ, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, జనసేన నాయకుడు ఆళ్ళ హరి, సత్యం తదితరులున్నారు.



అమరవీరుల సంస్మరణ దినంలో పాల్గొన్న ఏఎస్‌సీ శైలష్‌కుమార్

డీఆర్‌ఎం కార్యాలయంలో....

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విధి నిర్వహణలో మృతి చెందిన ఆర్‌పీఎఫ్ సిబ్బందికి రైల్వే సెక్యూరిటీ విభాగం అధికారులు ఘనంగా నివాళులర్పించారు. పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్(డీఆర్‌ఎం ఆఫీసు) ప్రాంగణంలో మంగళవారం అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేష్‌కుమార్, సిబ్బంది అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటర్ కమిటీ సభ్యులను నియమించాలి

- పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులను నియమించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం జేసీ శ్రీ అశుతోష్ శ్రీవాస్తవని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బి.విల్సన్ మాట్లాడుతూ కమిటీ లేకపోవడంతో బాధితులకు సరైన న్యాయం అందడం లేదని వాపోయారు. కొన్ని చోట్ల ఎఫ్ఐఆర్ నమోదు కాకుండానే ఫిర్యాదుదారుల వద్దే డబ్బులు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. జేసీని కలిసిన వారిలో లిటరేచర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ మూకిరి సుధ, సామాజిక కార్యకర్త దాసరి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

29 నుంచి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాపోటీలు

గుంటూరు (క్రీడలు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సివిల్ సర్వీస్ పురుషుల, మహిళ ఉద్యోగుల క్రీడా పోటీలు స్థానిక బీఆర్ స్టేడియంలో ఈనెల 29 నుంచి జరగనున్నాయి. రెండు రోజులు పాటు జరగనున్న ఈ పోటీలలో మొదటి రోజు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్ క్రీడాంశాలలో, రెండవ రోజు హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, యోగ, రెజ్లింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డాన్స్‌లలో పోటీలు జరుగుతాయి. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను నవంబరు 5 నుంచి 8 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర జట్టు తరుపున జాతీయ సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలలో పాల్గొంటారు. ఈ పోటీలలో పాల్గొనే సివిల్ సర్వీస్ ఉద్యోగులు తమ గుర్తింపు కార్డులతో ఉదయం 9 గంటలకు జిల్లా క్రీడాభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పి.అఫ్రోజ్ పేర్కొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

గుంటూరు విద్య అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ విద్యార్థిని యు.సత్య సహస్ర దేవి ఈత పోటీలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం, వై సహస్ర అండర్ 15 క్రికెట్‌లో ఎంపిక కాగా ఏ.సమంత టైక్వాండో, శిలంబంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తున్నామని, ఫలితంగానే రాష్ట్ర స్థాయిలో తమ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నట్లు ఆయన వెల్లడించారు.



విద్యార్థులు అభినందిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్

విశ్రాంత ఉపాధ్యాయుడు జగన్నాథం మాస్టారు మృతి

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు మున్సిపల్ స్కూల్ విశ్రాంత ఉపాధ్యాయుడు జగన్నాథం మాస్టారు(85) సోమవారం రాత్రి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కోడళ్ళు, మనవళ్లు, మనవరాళ్ళు ఉన్నారు. జగన్నాథం మాస్టారు వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న అనేకమంది ఉన్నత స్థాయికి చేరుకున్నారని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు తెలిపారు. జగన్నాథం మాస్టారు స్వగృహం పండరీపురం నుంచి మంగళవారం సాయంత్రం శ్మశాన వాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టారు శిష్యులు, బంధుమిత్రులు, నాయీబ్రాహ్మణ ఉద్యోగ సంఘ నాయకులు, సంఘ నేతలు పాల్గొన్నారు.



జగన్నాథం మాస్టారు (ఫైల్)

శీతల గిడ్డంగుల్లో ఇంకా 40 లక్షల మిర్చి టిక్కీలు

- ఎగుమతుల ఆర్డర్లు రోజుకు 50 వేల వరకు వస్తోన్నట్లు అంచనా
- డిసెంబరు నెలాఖరు వరకు కొత్త మిర్చి రాకుంటేనే మేలు
- బీహార్‌కు లారీలు పెట్టొద్దని యూపీ యూనియన్ ఓనర్స్‌కి మెసేజ్‌లు

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గత సీజన్‌లో ధర లేక శీతల గిడ్డంగుల్లో నిల్వ పెట్టిన మిర్చి టిక్కీలు పూర్తిగా విక్రయం జరుగుతాయో, లేదోనన్న సందిగ్ధం ట్రేడ్‌లో నెలకొన్నది. జూన్ రెండో వారం నాటికి దాదాపుగా 65 లక్షల మిర్చి టిక్కీల వరకు నిల్వవుండగా దేశీయంగా వచ్చిన ఆర్డర్స్‌తో ఇప్పటివరకు సుమారు 25 లక్షల టిక్కీల విక్రయం జరిగినట్లు ఎగుమతిదారులు చెబుతున్నారు. ఇంకా స్టోరేజ్‌లలో 40 లక్షల టిక్కీల వరకు నిల్వ ఉన్నట్లు అంచనా వేశారు. ఇవన్నీ విక్రయం జరగాలంటే కొత్త మిర్చి సంక్రాంతి వరకు రాకుంటేనే మేలు. అప్పుడే రైతుకు కొంతలో కొంతైనా గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం రోజుకు 50 వేలకు పైగా మిర్చి టిక్కీలు విక్రయం జరుగుతూ మార్కెట్ కొంత ఆశాజనకంగా ఉన్నప్పటికీ లారీ యూనియన్లతో తలెత్తిన సమస్య కారణంగా ఎగుమతులు క్షీణించే ప్రమాదం పొంచి ఉన్నది. అదే జరిగితే శీతల గిడ్డంగుల్లో మిర్చి నిల్వ చేసుకొన్న రైతులు నష్టపోయే పరిస్థితి ఉత్పన్నం అవుతుంది.

అన్‌సీజన్‌లో ఎలాగైనా మిర్చి ధర పెరుగుతుందన్న ఆశతో చాలామంది రైతులు తమ వద్ద ఉన్న మిర్చిని ఏప్రిల్, మే నెలల్లో కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేశారు. జూలై నుంచి ధర పెరగడం ప్రారంభం కావడం, నిత్యం 50 వేల టిక్కీలకు పైగా ఎగుమతుల ఆర్డర్లు బయ్యర్ల నుంచి రావడంతో మార్కెట్‌లో కొంత ఆశాజనక వాతావరణం ఏర్పడింది. ఇదే పరిస్థితి డిసెంబరు వరకు కొనసాగితే మరో 25 లక్షలకు టిక్కీలకు పైగా విక్రయం జరుగుతాయి. అయితే మిర్చి ఎక్కువగా ఎగుమతి జరిగే బీహార్, బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, బంగ్లాదేశ్ బోర్డర్‌కు లారీ కిరాయిల విషయంలో సమస్య తలెత్తింది. ఇక్కడ మళ్లీ రూ.1.71 లక్షల కిరాయిని యజమానులు కోరుతున్నారు. మరోవైపు ఖమ్మంలో రూ.1.38 లక్షలకే లారీలు పెడుతున్నారు. దాదాపుగా రూ.30 వేల కిరాయి వ్యత్యాసం ఉండటం, దూరం ఒకేలా ఉండటంతో నెమ్మదిగా బయ్యర్లు గుంటూరు నుంచి ఖమ్మం ఏఎంసీ వైపు చూడటం ప్రారంభించారు. మార్కెటింగ్ అధికారులు, జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే మాధవి పిలిచి మాట్లాడినప్పటికీ లారీ యజమానులు దిగి రావడం లేదు. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్ లారీ యజమానుల యూనియన్‌లోని సభ్యులకు కూడా మంగళవారం వాట్సాప్ సందేశాలు పంపించారు. ఎట్టి పరిస్థితుల్లో బీహార్‌కు లారీలు పెట్టొద్దని కోరారు. తద్వారా యూపీకి కూడా కిరాయి పెంచుకోవచ్చన్న భావన కలిగేలా ఆ సందేశం ఉన్నది. కాగా లారీల సమస్య దృష్ట్యా బుధవారం యార్డులో ధర క్వింటాల్‌కు రూ.500 తగ్గినట్లు ట్రేడర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రేడ్‌లో ఏమాత్రం ప్రతిష్టంభన తలెత్తినా రైతు తీవ్రంగా నష్టపోతాడు. దీనిని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం ఉన్నత స్థాయిలో సమస్య పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది.



శీతల గిడ్డంగిలో మిర్చి నిల్వలు



మహిళల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గంలో మహిళల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో ముందుకు వెళ్తున్నామని, అందులో భాగంగానే ప్రతి మంగళవారం 'మహిళా గ్రీవెన్స్ డే' నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో 'మహిళా గ్రీవెన్స్ డేను నిర్వహించి, వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కోబాల్డ్ పేట 6వ లైన్‌లో పీకల వాగు ఆక్రమణల వల్ల మురుగు నీరు తమ ఇళ్ళలోకి చేరుతుందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కొంతమంది మహిళలు వినతిపత్రం అందజేశారు. కొంతమంది విభిన్న ప్రతిభావంతులు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు, కన్నావారితోటలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆషా అనే మహిళా తానూ సైబర్ నేరగాళ్ల బారిన పడి సుమారు రూ.60 వేలు మోసపోయానని, అదే విధంగా కొంతమంది తమ వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ సమాజంలో మహిళలు చాలా మంది చెప్పుకోలేని పరిస్థితుల్లో బాధ పడుతుంటారని, వారి కోసం ఒక వేదిక, ఒక ప్రత్యేక రోజు అవసరం ఉందని చెప్పారు. కుటుంబ వివాదాలు, మోసాలు, చైన్ స్నాచింగ్‌లు, సైబర్ క్రైమ్స్ వంటి విషయాలలో వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం అందజేసి పరిష్కారం తీసుకువస్తున్నామని ఆమె చెప్పారు. మహిళా ఆరోగ్య సంరక్షణ, సాధికారత దిశగా కూడా పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కంపెనీలు, విద్యాసంస్థలతో సమన్వయం చేసుకుని మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.



కొర్రపాటి చెన్నకేశవులకు నివాళులర్పిస్తున్న నక్కా ఆనందబాబు, దళిత, ప్రజా సంఘాల నాయకులు

బడుగు, బలహీన వర్గాల గొంతుక చెన్నకేశవులు

- వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల వర్గాల గొంతుకగా కొర్రపాటి చెన్నకేశవులు ఉన్నారని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొనియాడారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం కొర్రపాటి చెన్నకేశవులు వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమస్యల పరిష్కారానికి చెన్నకేశవులు నిరంతర పోరాటాలు చేశారని గుర్తు చేశారు. నిజాయితీ, పోరాట తత్వం, సేవాభావం వంటి లక్షణాలు ఉండటంతో ప్రజల మనస్సులో చెన్నకేశవులు చిరస్థాయిగా నిలబడ్డారని కొనియాడారు. ఆశయాలను కొనసాగించడమే ఆయనకిచ్చే ఘన నివాళులని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడిద బాబురావు, మురికిపూడి దేవపాల్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజేస్, ఐలా రాష్ట్ర అధ్యక్షుడు శాంతకుమార్, ఈమని చంద్రశేఖర్, అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, అడపా మోహన్, ఖాజావలి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పురస్కారాలకు ఎంపికలు

గుంటూరు(క్రీడలు) అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందజేయనున్న క్రీడా పురస్కారాల కొరకు అర్హులైన క్రీడాకారుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నది. మేజర్ ధ్యాన్ చంద్ అత్యున్నత ఖేల్ రత్న అవార్డులతో పాటు అర్జున్, ద్రోణాచార్య, రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహక పురస్కారాలను అందజేయనున్నారు. అర్హులైన క్రీడాకారులు ఈనెల 28వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.అఫ్రోజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జీజీహెచ్ ఎదుట 1984 బ్యాచ్ పోలీసుల అన్నదానం

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1984 బ్యాచ్ పోలీస్ అధికారులు(కురిచేడు ట్రైనింగ్ సెంటర్) మంగళవారం జీజీహెచ్ ఎదుట అన్నదానం చేశారు. ఈ సందర్భంగా 300 మందికి కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 1984 బ్యాచ్ పోలీస్ అధికారులు, జీజీహెచ్ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పోలీస్ సిబ్బంది

పత్తి కొనుగోళ్లపై పునశ్చరణ కార్యక్రమం

- నేడు గుంటూరు ఏఎంసీలో నిర్వహణ
- హాజరుకానున్న మార్కెటింగ్ కమిషనర్

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 2025-26 సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్ల కొద్ది రోజుల్లో ప్రారంభం కానుండటంతో సంబంధిత అధికారులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో సమాయత్తం చేసేందుకు మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. ఇందుకోసం ఈ నెల 22వ తేదీ గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)లో నోటిఫైడ్ ఏఎంసీల సెక్రెటరీలు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీసీఐ బయ్యర్లకు పునశ్చరణ తరగతులను నిర్వహించనుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ తరగతులు జరగనున్నాయి. మార్కెటింగ్ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత హాజరై ఆర్‌జేడీ, ఆర్‌డీడీ, డీఏటీఎంలో సమక్షంలో ఈ తరగతులను పర్యవేక్షించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు అమరావతి రాజధానిలోని ఏపీ సచివాలయంలో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరుగుతుంది.

పెద్దమ్మను దర్శించుకున్న డ్వామా పీడీ

కొత్తచెరువు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి జిల్లా కొత్త చెరువు మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవతను దీపావళి పండుగ సందర్భంగా గుంటూరు జిల్లా డ్వామా పీడీ వి.శంకర్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెద్దన్న, ఆలయ పెద్దలు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. పండుగ సందర్భంగా పెద్దమ్మ ఘటాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

ఫ్యాషన్



ధగధగలాడే బంగారం డ్రస్

బంగారంతో ఆభరణాలతో పాటు దుస్తులూ రూపొందుతూ ఉంటాయి. తాజాగా దుబాయ్‌కు చెందిన అల్ రొమోజాన్ ఆభరణాల బ్రాండ్... పది కిలోల బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల ఖరీదైన 'దుబాయ్ డ్రస్'ను రూపొందించింది. ఇలాంటి బంగారం దుస్తుల స్ఫూర్తితో ట్రెండ్‌గా మారిపోతున్న గోల్డెన్ డ్రస్సుల మీద ఓ లుక్కేద్దామా...



9.5 కోట్ల డ్రస్

విలాసాలకూ, సంపదకూ పేరు పొందిన దుబాయ్ తాజాగా 21 క్యారెట్ల మేలిమి బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల రూపాయల విలువైన బంగారం డ్రస్‌ను రూపొందించి, గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. పది కిలోల బరువున్న ఈ డ్రస్ ప్రపంచంలోనే అత్యంత బరువైన, విలువైన డ్రస్‌గా పేరు తెచ్చుకుంది. ఒక బంగారు కిరీటం, నెక్లెస్, నడుముకు తగిలించుకునే హియార్ అనే ఆభరణం లాంటి అదనపు హంగులు కూడా ఈ డ్రస్‌కు తోడవడం విశేషం. ఎమిరాటి సంస్కృతిని ప్రతిబింబించేలా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చరిత్ర, వారసత్వాలకు అద్దం పడుతూ చక్కని పనితనంతో, ఆకృతులతో ఈ డ్రస్‌ను ఎంతో కళాత్మకంగా రూపొందించారు.

బంగారం ప్రియులను అలరించేలా...

ఈ దుస్తులకు తగ్గట్టుగా రూపొందించిన బంగారం టియారా 398 గ్రాముల బరువుంటే, నెక్లెస్ ఏకంగా 8,810 గ్రాముల బరువుంది. ఇయర్ రింగ్స్ 134 గ్రాముల బరువున్నాయి. ఇలాంటి అత్యంత బరువైన, విలువైన బంగారం డ్రస్ రూపకల్పన... ప్రపంచ నాయకత్వాన్ని చాటుకోవాలనే యుఎఇ ఆశయం ప్రతిబింబించడంతో పాటు దుబాయ్ నగరం... బంగారు ఆభరణాల ప్రియుల ప్రధాన గమ్య స్థానంగా ప్రత్యేక గుర్తింపును కూడా పొందగలిగింది. షార్జాలో జరిగిన 56వ మధ్యప్రాచ్య వాచ్ అండ్ జ్యువెలరీ ప్రదర్శనలో భాగంగా పలు ఆభరణాల కంపెనీలు తమ ఆసక్తికరమైన ఉత్పత్తు లను ప్రదర్శించాయి. 500మందికి పైగా స్థానిక, అంతర్జాతీయ ప్రదర్శనకారులు పాల్గొనగా, ప్రపంచవ్యాప్తంగా 1800 మంది డిజైనర్లు, వర్తకులు వారి ఉత్పత్తులు ప్రదర్శించారు. వీటిలో దుబాయ్ డ్రస్‌తో పాటు మూడున్నర కోట్ల రూపాయల విలువైన గోల్డ్ ప్లేటెడ్ సైకిల్ కూడా ఉండడం చెప్పుకోదగిన విశేషం!



వినూత్నం

ప్రతి ఒక్కరిలో రహస్య నైపుణ్యాలు దాగి ఉంటాయి. వాటిని కనిపెట్టి మెరుగులు దిద్ది, ప్రతిభను చాటుకునే సామర్థ్యం కొందరికే ఉంటుంది. కేరళకు చెందిన బీట్ ఆఫీసర్, బిస్మి విల్స్ కథే ఇందుకు ఉదాహరణ. అటవీ శాఖలో వృత్తి బాధ్యతలకే పరిమితమైపోకుండా, తనలోని కెమెరా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుని, కేరళ అటవీ శాఖ ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ ప్రయత్నాలకు నిదర్శనంగా మారిందామె. మరిన్ని వివరాలు...

అడవిలో ఫొటోగ్రాఫర్‌గా మారి..

తిరువనంతపురంలోని పరసాలకు చెందిన బిస్మి విల్స్. కేరళ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా ఎంపికైంది. పరీక్ష పాసై, ఉద్యోగానికి ఎంపికైంది కాబట్టి వృత్తిలో చేరాలనే ఆలోచనే తప్ప, వృత్తి పట్ల ఆమెకెలాంటి ఆసక్తి కలగలేదు. అయితే ఆమె పై అధికారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రియ టి.జోసెఫ్ మాటలు బిస్మిని ప్రభావితం చేశాయి. వృత్తిలో పైకి ఎదగాలంటే, వృత్తి పట్ల నిబద్ధత కలిగి ఉండాలనీ, మక్కువ పెంచుకోవాలనీ ప్రియ... బిస్మికి హితబోధ చేసింది. ఆ మాటలు బిస్మి మనసులో నాటుకుపోయాయి. అప్పటి నుంచి అడవిలో గస్తీ సమయంలో పరిసరాలను ఆసక్తిగా గమనించడం మొదలుపెట్టింది.

చుట్టూరా అందమైన ప్రకృతి, ఆసక్తి కలిగించే వన్యప్రాణులు, వాటి ప్రవర్తనలు ఆమెను ఆకట్టుకోవడం మొదలుపెట్టాయి. వాటిని జ్ఞాపకాల్లో బంధించడంతో పాటు, అటవీ శాఖకు ఉపయోగపడేలా కెమెరాలో బంధిస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే ఆలోచనతో ఒకడిఎస్ఎల్ఆర్ కెమెరా కొనుగోలు చేసింది బిస్మి. ఈ సందర్భం గురించి ప్రస్తావిస్తూ...'పంప ప్రాంతంలో విధులు నిర్వహించే సమయంలో అక్కడి చెట్ల ఆకులు నన్ను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఫీల్డ్ డ్యూటీలో భాగం వేర్వేరు చెట్లను గుర్తు పెట్టుకోవడం కోసం వాటి ఆకులను



సేకరించడం మొదలుపెట్టాను. ఆ తర్వాత నా ఆసక్తి సీతాకోకచిలుకల మీదకు మళ్లింది. వేర్వేరు జాతుల డేటాను సేకరించడం కోసం ఒక యాప్‌ను కూడా ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకున్నాను. అయితే చిన్న జాతుల మధ్య తేడాలను గుర్తించాలంటే వాటిని ఫొటోలు తీసుకోక తప్పదు. దాంతో నాది పాత ఫోన్ అవడంతో, ఒక డిజిటల్ కెమెరా కొనుక్కున్నాను" అంటూ తన కెమెరా ప్రయాణం తొలినాళ్ల గురించి వివరించింది బిస్మి.

నేర్పు, ఓర్పు అవసరం

పంప నుంచి వలక్కడువుకు బదిలీ అవడంతో బిస్మిలోని వన్యప్రాణుల ప్రేమికురాలు మేలుకొంది. "పంపకు భిన్నంగా వలక్కడువులో ఏనుగులు, సాంబార్ డీర్.. ఇతర జంతువులు కనిపిస్తూ ఉండేవి. ఫారెస్ట్ వాచర్, అనుభవమున్న వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ విష్ణు నాకు తోడయ్యాడు. దాంతో ఇద్దరం కలిసి వన్యప్రాణులను వెతుక్కుంటూ కొండల మీద తిరగడం మొదలుపెట్టాం. ఏనుగుల వాసనను పసిగట్టి, వాటికి 250 మీటర్ల దూరానికి చేరుకుని, అందమైన ఫొటోలు తీయడం మొదలుపెట్టాం. జంతువుల దృష్టిలో పడకుండా ఎలా నడుచుకోవాలో, వాటికి భంగం కలగకుండా ఫొటోలు ఎలా తీయాలో, గాలి వీచే దిశ ఆధారంగా, నా ఉనికిని జంతువులు పసిగట్టే వీలు లేకుండా ఫొటోలకు తగిన ప్రదేశాన్ని ఎలా ఎంచుకోవాలో అతను నాకు నేర్పించాడు.

ఆ మెలకువల మీద పట్టు పెరిగిన తర్వాత, ఎన్నో మరపురాని ఫొటోలను తీయగలిగాను. ఎలుగుబంటి మీద దాడి చేసే అడవి కుక్కను ఫొటోలో బంధించగలిగాను. మేత మేస్తూ, గొడవ పడుతూ, ప్రేమ ప్రదర్శించుకునే పాతిక ఏనుగుల మందను ఫొటోలు తీయగలిగాను. అయితే ఫొటోల కోసం నేను చేసే ప్రతి ప్రయత్నం ఫలిస్తుందనే నమ్మకం ఉండదు. గంపెడు ఆశతో వెళ్లి, నిరుత్సాహంతో వెనుతిరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. గంటల తరబడి ఎదురుచూసి, ఖాళీ చేతులతో తిరిగొచ్చిన రోజులూ లేకపోలేదు. వన్యప్రాణుల ఫొటోగ్రఫీకి ఎంతో నేర్పు, ఓర్పు అవసరం" అంటూ ఫొటోలు తీయడంలో ఎదుర్కొన్న శ్రమల గురించి వివరిస్తోంది బిస్మి.

పులిని ఫొటో తీయాలి

"నా అంతిమ లక్ష్యం పులిని ఫొటోలు తీయడం. చాలాసార్లు వాటిని అనుసరించినా, కెమెరాలో బంధించే అవకాశం ఇప్పటివరకూ రాలేదు. పులులు సిగ్గరులు. అవి మనుషులకు దూరంగా ఉంటాయి. అయినా ఏదో ఒకనాటికి పులిని కచ్చితంగా కెమెరాలో బంధిస్తాను' అంటున్న బిస్మి, ప్రకృతి, వన్యప్రాణుల పట్ల ప్రేమతో అటవీ శాఖలో చేరుతున్న మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందనీ, అయితే ఈ వృత్తిలోకి అడుగుపెట్టే ప్రతి ఒక్కరూ అడవులు, వన్యప్రాణుల పట్ల మక్కువను పెంచుకోవడం అవసరమని అంటోంది. ఆమె తీసిన ఫొటోలు కేరళ అటవీ శాఖ డాటా సేకరణకు ఎంతో బాగా ఉపయోగపడుతున్నాయి. బిస్మి ఫొటోల వల్ల, అడవిలో వన్యప్రాణుల జీవనశైలి, వాటి మధ్య వైవిధ్యాలను ఆధారాలతో సహా ప్రదర్శించగలిగే అవకాశం కూడా దక్కుతూ ఉండడం చెప్పుకోదగిన విశేషం .



ఈ మహిళా కారాగారం... బతుకుల్ని మార్చే ఆశ్రమం

వివిధ కారణాలతో ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న వారి జీవితాల్లో మార్పు కోసం, సాధికారత కోసం కృషి చేస్తోంది రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం.
ఈ సెమీ ఓపెన్ ప్రిజన్‌లో, ఆశ్రమంలాంటి వాతావరణంలో మహిళా ఖైదీలు... పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు.
కూరగాయల పెంపకం, పిండి వంటల తయారీ... ఇలా ఎన్నో మార్గాలతో జైలుకు ఆదాయాన్ని సమకూరుస్తూ, వేతనాలు సంపాదిస్తున్నారు.
జైలు నుంచి విడుదలయ్యాక సొంతకాళ్ల మీద నిలబడి, స్వయంసమృద్ధి సాధించడానికి పునాదులు వేసుకుంటున్నారు.



కృషితో నాస్తి దుర్భిక్షం... ఇది పెద్దలు చెప్పిన మంచి మాట. కృషితో మంచి మార్పు కూడా సాధ్యమేనని రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం అధికారులు రుజువు చేస్తున్నారు. మహిళా ఖైదీలకు చదువుతోపాటు పంటల సాగు, వంటల తయారీలో నైపుణ్యాలను అందించి, జైలు నుంచి వారు విడుదలయ్యాక... సొంత కాళ్ల మీద నిలబడేందుకు ఊతం ఇస్తున్నారు. దేశంలోని కొన్ని మహిళా కారాగారాల్లో ఓపెన్ ప్రిజన్ విధానం ప్రారంభమైనా, రకరకాల సమస్యలతో కొంత కాలానికే మూతపడ్డాయి. కానీ ఇక్కడ ఏడాదిన్నర నుంచి విజయవంతంగా అమలవుతోంది. ఆ జైలులోని మహిళా ఖైదీలు ఎన్నో రకాల పంటలు పండిస్తూ జైలుకు ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు వేతనాల రూపంలో తామూ సంపాదించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప, రాజమహేంద్రవరంలో మాత్రమే ప్రత్యేక మహిళా కారాగారాలు ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని కారాగారాన్ని ఆశ్రమం మాదిరిగా తీర్చిదిద్దారు. మహిళా ఖైదీల జీవన స్థితిగతులను మెరుగుపరచడం కోసం, శిక్ష పూర్తయ్యాక తక్కువ పెట్టుబడితో వ్యాపారం చేసుకొని జీవనోపాధి పొంపొందడం కోసం వారికి ఆసక్తి ఉన్న పనిలో తర్ఫీదు ఇస్తున్నారు. వారి నైపుణ్యాలను పదునుపెడుతున్నారు.

పూర్తి సేంద్రియంగా...

ఈ కారాగారంలో సెమీ ఓపెన్ ప్రిజన్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.. సాధారణంగా శిక్షపడిన, రిమాండ్ ఖైదీలను జైలు లోపల ఉంచుతారు. వాళ్లలో సత్ప్రవర్తనతో మెలిగే జీవిత ఖైదీలను జైలు ప్రాంగణంలో వివిధ అవసరాలకు వినియోగిస్తారు. ఇక్కడి ఓపెన్ ప్రిజన్ కోసం 27 మంది ఖైదీలను ఎంపిక చేశారు. వారిలో కొందరు విడుదల కాగా... ప్రస్తుతం 15 మంది ఉన్నారు. వీళ్లను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. ఈ జైలుకు చెందిన అయిదు ఎకరాల భూమి పూర్వం చిట్టడవి మాదిరిగా ఉండేది. దాన్ని సాగుకు అనువుగా మలిచారు. సుమారు రూ.1.50 లక్షలతో డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ భూమిలో అంజూర, షర్బత్ నిమ్మ, ఉసిరి, సీతాఫలం, వాటర్ యాపిల్, నారింజ, బత్తాయి, మామిడి, పనస, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, జామ తదితర పండ్ల మొక్కలను నాటారు. వంకాయ, బెండ, దోస, ఆనప, కాకర, గోరు చిక్కుడు, పందిరి చిక్కుడు, బీర, టమాట, దొండ లాంటి కూరగాయలతో పాటు ఆకు కూరలను జైలు సిబ్బంది పర్యవేక్షణలో మహిళా ఖైదీలు సాగు చేస్తున్నారు. వీరికి గతంలో ఎలాంటి వ్యవసాయ అనుభవం లేదు. ఉద్యానవన, అటవీ, వ్యవసాయ తదితర శాఖల సలహాలను పాటిస్తూ పూర్తి ప్రకృతి, సేంద్రీయ పద్ధతిలో పంటలను పండిస్తున్నారు. ట్రాక్టరు లాంటి యంత్రాలు లేకుండా సంప్రదాయ విధానాలను అనుసరిస్తూ... రోజుకు రూ.1500 వరకూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.





త్వరలో క్యాటరింగ్ సేవలు...

రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారంలో కవర్ల తయారీ యూనిట్, బేకరీ యూనిట్, టైలరింగ్ యూనిట్ ఉన్నాయి. వీటిలో తయారు చేసే పదార్థాలు, వస్త్రాలు, వస్తువులను జైలు బయట విక్రయిస్తారు. అలాగే రాగి మాల్ట్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి జైలు బయట చేసే ఆకు కూరలు, కాయగూరల విక్రయాలు అరగంటలో పూర్తయిపోతాయి. బేకరీ యూనిట్‌లో నాణ్యమైన దినుసులు ఉపయోగించి... స్వీట్లు చాక్లెట్లు, ఉస్మానియా బిస్కట్లు, ఫ్రూట్‌కేక్, బ్రెడ్, వాము పకోడీ, కారప్పూస, జంతికలు, అటుకుల మిక్చర్, కార్న్ ఫ్లాక్స్ బూందీ, బెల్లం గవ్వలు లాంటివి తయారు చేసి బహిరంగ మార్కెట్ కంటే తక్కువకే విక్రయిస్తున్నారు. ఇవి నిల్వ ఉండడానికి, రుచి పెంచడానికి ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. పిండి వంటలు, బేకరీ ఐటమ్స్, టైలరింగ్, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రోజుకు రూ.5వేల వరకూ జైలుకు ఆదాయం సమకూరుతోంది. "ఇప్పటికే ఆర్డర్లపై పిండి వంటలు తయారుచేసి ఇస్తున్నాం. త్వరలో క్యాటరింగ్ సేవలు, స్వీట్ స్టాల్ కూడా ప్రారంభిస్తాం. ఈ ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత బతుకుతెరువుకు ఇబ్బంది పడకుండా సమాజంలో గౌరవంగా జీవించాలనేదే మా ధ్యేయం. దీని వెనుక మా డీజీ, ఐజీ, డీఐజీల ప్రోత్సాహం చాలా ఉంది. మహిళా ఖైదీలతో వ్యవసాయం దిశగా అడుగులు వేయడంలో డీజీ హరీశ్ కుమార్ గుప్తా ఎంతో సహకరించారు. మా సిబ్బంది సహాయంతో మహిళా ఖైదీల జీవితాల్లో మెరుగైన మార్పులు రావడానికి కృషి చేస్తున్నాం" అంటున్నారు జైలు సూపరింటెండెంట్ వసంతకుమారి.

తారతమ్యాలు లేకుండా...

రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారంలో తారతమ్యాలకు తావు ఉండదు. ఏ పండుగ వచ్చినా అందరూ కలసిమెలసి చేసుకుంటారు. జైలు అధికారులు, సిబ్బంది కూడా భాగస్వాములవుతారు. ఎవరి ప్రార్థనాలయాలు వారికి ఉన్నాయి. రోజూ ఉదయం యోగాతో ఖైదీలు తమ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. తర్వాత కాసేపు ఇష్ట దైవారాధన చేసి, దైనందిన పనుల్లో నిమగ్నమవుతారు. వంటశాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుతారు. జైలు ఆవరణలో ఎటు చూసినా పచ్చదనం, అందమైన రంగవల్లులు కనువిందు చేస్తాయి. ఈ ప్రాంగణంలో ఆరు పడకల ఆసుపత్రి ఉంది. వైద్యులు నిరంతరాయంగా అందుబాటులో ఉంటారు. డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సులు చదివే సౌలభ్యం ఉంది. అధికారుల ప్రోత్సాహంతో 2008 నుంచీ ఇప్పటి వరకూ 32 మంది డిగ్రీ, ఇద్దరు పీజీ పూర్తి చేశారు. 2021-2024లో డిగ్రీ పూర్తి చేసిన డి.నాగరాజకుమారి బంగారు పతకం సాధించారు. ఈ కారాగారంలో అయిదు వేల పుస్తకాల గ్రంథాలయం కూడా ఉంది.

• పి.రమేశ్ నాగేంద్ర

వంటింటి వ్యర్థాలే బలం..!

మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి ఎరువులు అత్యవసరం. రసాయన ఎరువులకు బదులు వంటింటి వ్యర్థాలను ఉపయోగిస్తే మొక్కలు మరింత ఆరోగ్యంగా ఉంటాయి. వంటింటి వ్యర్థాలను సేంద్రీయ ఎరువులుగా ఎలా వాడాలో తెలుసుకుందాం...

- కోడిగుడ్డు పెంకుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది మొక్క పెరుగుదలకు తోడ్పడడమే కాకుండా పూలు, కాయలు అధికంగా ఉత్పత్తి కావడానికి దోహదం చేస్తుంది. కోడిగుడ్డు పెంకులను మెత్తగా పొడి చేయాలి. మొక్కల మొదళ్లలో కొద్దిగా



తవ్వి, వేర్ల చుట్టూ ఈ పొడిని చల్లాలి. తరువాత యథావిధిగా మట్టిని పరచి కొన్ని నీళ్లు చిలకరించాలి. గుడ్డు పెంకుల పొడిని నీళ్లలో కలిపి రోజూ మొక్కల మొదళ్లలో పోసినా ప్రయోజనం కనిపిస్తుంది.
- అరటి పండు తొక్కలో అధికంగా ఉండే పొటాషియం, భాస్వరం లాంటి మూలకాలు.. పూల ఉత్పత్తిని పెంచుతాయి. అరటి తొక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసి ఒక ప్లాస్టిక్ బాటిల్‌లో వేయాలి.



నిండా నీళ్లు పోసి మూతపెట్టి మూడు రోజులు అలాగే ఉంచాలి. తరువాత ఈ నీటిని మొక్కల మొదళ్లలో పోస్తే పువ్వులు గుత్తులు గుత్తులుగా వస్తాయి.
- ఆకు కూరల కాడలు, కూరగాయల వ్యర్థాలు.. సహజ ఎరువులుగా పనిచేస్తాయి. వీటిని మట్టిలో కలిపి మొక్కల మొదళ్లలో చల్లవచ్చు. లేదంటే మొక్కల మొదళ్లలో, చుట్టూరా కొద్దిగా తవ్వి వీటిని వేసి పైన మట్టితో కప్పవచ్చు.
- వాడేసిన టీ పొడిలో కొన్ని నీళ్లు పోసి వడకట్టాలి. ఈ పొడిని గట్టిగా పిండి కాగితం మీద వేసి బాగా ఆరబెట్టాలి. తరువాత ఈ పొడిని వారానికి ఒకసారి కొద్దికొద్దిగా తీసుకుంటూ మొక్కల మొదళ్లలో చల్లాలి. ఇలా చేయడం వల్ల పచ్చని ఆకులతో మొక్కలు ఏపుగా పెరుగుతాయి.



పిల్లల విషయంలో జాగ్రత్త..!

నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లలపై రకరకాల ఆశలు పెట్టుకుంటున్నారు. వాటిని సాధించి తీరాలంటూ పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారు. దీని వల్ల పిల్లల మానసిక స్థితి ప్రభావితమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలను పెంచే క్రమంలో తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...



- పిల్లలందరి శక్తి సామర్థ్యాలు, ఆలోచన తీరు ఒకేరకంగా ఉండవు. కాబట్టి పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. అవసరమైన శిక్షణ ఇప్పించాలి.
- క్రమశిక్షణ పేరుతో పిల్లలకు కఠినమైన ఆంక్షలు పెట్టకూడదు. కేవలం చదువుకు మాత్రమే ప్రాముఖ్యమిస్తే పిల్లలు ఆటపాటల్లో రాణించలేరు. అంతేకాదు వాళ్లకు.. ఇతరులతో మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, పోటీ తత్త్వం అలవడవు.
- పిల్లలు ఏవైనా పొరబాట్లు చేస్తే వారిపై కోపం చూపించకూడదు. సామరస్యంగా వ్యవహరించి మంచి, చెడుల తారతమ్యాన్ని వివరించాలి.
- పరీక్షల్లో మార్కులు తగ్గాయనో, ఆటల్లో ఓడిపోయారనో పిల్లలను 'నీకేమీ చేతకాదు' అంటూ నిరాశ పరచకూడదు. దీనివల్ల పిల్లల ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. మరో ప్రయత్నం చేసి అనుకున్నది సాధించేలా పిల్లలను ప్రోత్సహించాలి.
- పిల్లల ఇష్టాలు, ఆశయాలు తెలుసుకోకుండా చెప్పిన మాట వినాలంటూ ఒత్తిడి చేయకూడదు. పిల్లలు ఏవిధంగా ఆలోచిస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. పిల్లల అభిరుచులను గమనిస్తూ ఉండాలి. సమయం దొరికినప్పుడల్లా పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి.
- పిల్లల మీద అతిగా ప్రేమ చూపిస్తూ వాళ్లు ఏమి చేసినా సమర్థించడం కూడా మంచిది కాదు. పిల్లలకు సమయపాలన, తోటివారితో స్నేహంగా ఉండడం, పెద్దలతో మర్యాదగా మెలగడం, సమయస్ఫూర్తి నేర్పించాలి. పోషకాహారం, వ్యాయామం, వ్యక్తిగత శుభ్రతల గురించి తెలియజెప్పాలి.

గుంటూరు రూరల్ వార్తలు

పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కులనీరు మంగళవారం విడుదల చేస్తున్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 36,500 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 256 క్యూసెక్కులనీరు, రేపల్లె కాల్వకు 1460 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 563 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 119 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 366 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 2260 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 36 వేల 250 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 46 వేల 194 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.4 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 36 వేల 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 4236 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5727 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు ఛానల్ కాలువకు 151 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పాఠశాలలో దీపావళి



వేమవరం ఎంపీపీ స్కూల్లో దీపావళి వెలుగులతో విద్యార్థులు

ఫిరంగిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు దీపావళి పండుగను మంగళవారం ఘనంగా జరిపారు. దీపావళి పండుగ విశేషాలను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ కార్తీక్, కమల మోహన్ లు వివరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, స్కూల్ కమిటీ అధ్యక్షులు సుబ్బయ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఏ జీవోను వెంటనే సవరించాలి

● ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్ బాబు

గుంటూరు విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాలతో మంత్రివర్గ సబ్ కమిటీ ముఖ్యమంత్రి స్థాయిలో పలు విడతలుగా చర్చించి సోమవారం విడుదల చేసిన జీవో నెంబర్ 60, 61లను వెంటనే సవరించాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కంకరగుంటలోని ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రితో చర్చల తర్వాత ఉద్యోగులకు దీపావళి కానుకగా డీఏ వస్తుందని ఆశపడ్డారు కానీ ఆర్థిక శాఖ విడుదల చేసిన జీవోలలో ఉద్యోగులకు చెల్లించవలసిన డీఏ బకాయిలను పదవి విరమణ అనంతరం చెల్లిస్తామని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బా రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల చోరీ నిందితుల అరెస్టు

గీసుగొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని జాన్‌పాక వద్ద వారం రోజుల కిందట జరిగిన వాహనం చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని వాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా జాన్‌పాక రైల్వే గేటు వద్ద ద్విచక్రవాహనాన్ని దొంగిలించినట్లు తెలిపారు. దొంగతానికి పాల్పడిన ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పాతమల్లయ్యపాలెంకు చెందిన పుల్లగోరు శాంతి కుమార్, మహబూబాబాద్ జిల్లా గుగులోతుతండాకు చెందిన భూక్య వినయ్‌లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటర్ కమిటీ సభ్యులను నియమించాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులను నియమించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జామువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం జేసీ శ్రీ అశుతోష్ శ్రీవాస్తవని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బి.విల్సన్ మాట్లాడుతూ కమిటీ లేకపోవడంతో బాధితులకు సరైన న్యాయం అందడం లేదని వాపోయారు. కొన్ని చోట్ల ఎఫ్ఐఆర్ నమోదు కాకుండానే ఫిర్యాదుదారుల వద్దే డబ్బు లు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. జేసీని కలిసిన వారిలో లిటరేచర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు సుధ, సామాజిక కార్యకర్త దాసరి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులు.. కనిపించని హెచ్చరిక బోర్డులు



తాడికొండ-కంతేరు రోడ్డులో ఉన్న మలుపు



మోతడక - లచ్చన్నగుడిపూడి వద్ద ఉన్న మలుపు

తాడికొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో రోడ్డు మలుపులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. భారీ మలుపుల్లో వాహన చోదకులు అనేకసార్లు ప్రమాదాలకు గురైనా.. ఆర్ అండ్‌బీ శాఖ కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. మోతడక నుంచి లచ్చన్న గుడిపూడి మీదుగా ముక్కామల వరకు వెళ్లే పది కిలో మీటర్ల రోడ్డులో పది భారీ మలుపులు ఉన్నాయి. పొన్నెకల్లు నుంచి దామరపల్లి అడ్డరోడ్డు, గరికపాడు మీదుగా బండారుపల్లి రోడ్డులో ఐదారు మలుపులు ఉన్నాయి. తాడికొండ నుంచి కంతేరు మీదుగా జాతీయ రహదారికి వెళ్లే రోడ్డులోనూ ఐదు మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఒక మలుపు వద్ద మాత్రమే బోర్డు ఉన్నది. మిగిలిన మలుపుల్లో బోర్డులు లేవు. అయితే భారీగా ఉన్న చోట ఎదురెదురు భారీ వాహనాలు వచ్చినా.. ఇతర వాహనాలు ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా.. ప్రమాదానికి గురయ్యే అవకాశం కన్పిస్తోంది. అంతేకాకుండా రోడ్డు మార్జిన్స్ కూడా సరిగా లేవు. పగటి పూట కంటే రాత్రి పూట మలుపుల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంతేరు - నిడమర్రు రోడ్డు మలుపుల్లో పిచ్చి మొక్కలు పెరిగి ఉన్నాయి. కొత్తగా ఈ రహదారి నుంచి ప్రయాణించాలంటే ప్రమాదం కొని తెచ్చుకోవాల్సిందేనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈ మలుపుల్లో గతంలో అనేక సార్లు వాహన ప్రమాదాలు జరిగాయి. అందువల్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

అమెరికాకు లొంగిపోయిన మోదీ ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎడాపెడా విధిస్తున్న సుంకాల విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయిందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు. తాడేపల్లి దివంగత సీపీఎం నేత మేకా అమరారెడ్డి 44వ వర్ధంతి సందర్భంగా ట్రంప్ సుంకాలు - భారత్‌పై ప్రభావం అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు ఐద్వా రాష్ట్ర కోశాధికారి దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి అధ్యక్షత వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ అమెరికా భారత్‌పై విధిస్తున్న 50 శాతం సుంకాలు దేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎడాపెడా పన్నులు విధిస్తూ మరో పక్క బెదిరిస్తున్న ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ నోరు మెదపక పోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 1990లో నూతన ఆర్థిక విధానం ప్రారంభమైన సమయంలో వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఒప్పందం మేరకు ఏ దేశమైనా తనకు అవసరమైన సరుకులను ఎగుమతులు, దిగుమతులు ఎటువంటి షరతులు లేకుండా చేసుకోవచ్చని ఆనాడు అమెరికా ప్రతిపాదించిన విషయాన్ని లక్ష్మణరావు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర నాయకుడు చిట్టి, బూరుగ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కాలనీలో దుప్పట్ల పంపిణీ

తాడేపల్లి : సీపీఎం నేత మాజీ సర్పంచ్ మేకా అమరారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం పట్టణ కమిటి ఆధ్వర్యంలో కొత్తూరు శాఖ పరిధిలోని అంబేద్కర్ కాలనీలోని పేదలు 100 కుటుంబాలకు మంగళవారం దుప్పట్లు, కండువాలు, సీపీఎం నేతలు పంపిణీ చేశారు. ప్యారీ కంపెనీ ఆవరణలో నివసిస్తున్న 75 పేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం నేతలు మొదుగుల శ్రీనివాసరెడ్డి, డి విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ప్రజల కోసం ప్రాణాలర్పించిన ధన్యజీవి మేకా అమరారెడ్డి అని సీపీఎం సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి నివాళులర్పించారు.

భక్తి శ్రద్ధలతో గ్యార్మీ పండుగ



గ్యార్మీ పండుగ వేడుకల దృశ్యం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని నులకపేటలో ముస్లింలు గ్యార్మీ పండుగ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జెండా చెట్టు వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ గ్యార్మీ పండుగను హిందువులు, ముస్లింలు కలిసికట్టుగా జరుపుకున్నారు. అనంతరం 3వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కొండపల్లి ఆస్థాన పీఠాదిపతులు హజరత్ సయ్యద్ షాబ్‌కార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఐక్యమత్యానికి నిదర్శనం గ్యార్మీ పండుగ అని ఈ సందర్భంగా దువా నిర్వహించారు. ఇతరులతో ప్రతి ఒక్కరూ ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో గోసపక్ కమిటీ సభ్యులు ఎండి గోరేబాబు, ఎండీ ఇఫ్రాన్, షేక్ నాగుల్‌మీరా, సైదా, బాషా, మాదన్, షఫి, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

మంగళగిరి సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న పన్నుల భారంపై నిరసన వ్యక్తం చేస్తూ సీపీఎం, దాని అనుబంధ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో కాజలో మంగళవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి కోటేశ్వరి, ఎస్ సుమ, నిర్మల, పున్నయ్య, అప్పారావు, నాగేశ్వరరావు, గోపాలరెడ్డి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల, ఫిరంగిపురం: సీపీఎం అనుబంధ సంఘాలైన ఆంధ్రప్రదేశ్ వ్యకాస, కౌలురైతుసంఘం ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రపటాన్ని మంగళవారం దహనం చేశారు. జెట్టి బాలరాజు, మన్నవ నాగమల్లేశ్వరరావు, బాలచంద్రుడు, మల్లికార్జునరావు, నరసింహారావు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



ఎస్సీ బాలురవసతి గృహంలోని కళాశాల విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న వల్లూరు నరసింహారావు

దుగ్గిరాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న కళాశాల విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర ఐటీ, విద్య, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ పంపిన దుప్పట్లను దీపావళి సందర్భంగా సోమవారం సాయంత్రం అందించారు. టీఎన్‌యూఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు వల్లూరు నరసింహారావు చేతుల మీదుగా విద్యార్థులందరికీ దుప్పట్ల అందించారు. నరసింహారావు మాట్లాడుతూ ఐదేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోక విద్యార్థులు నానా అవస్థలు పడ్డారని, లోకేశ్ చొరవతో పూర్తిస్థాయిలో మరమ్మతుల జరిపించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. వార్డెన్ జీ. పూర్ణప్రసాద్ సమక్షంలో దుప్పట్లు అందుకున్న విద్యార్థులు మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశానవాటికలో డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



ఎస్సీ శ్మశాన వాటిక ఆవరణలో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న ఎంపీటీసీ లక్ష్మీదేవి

దుగ్గిరాల (తుమ్మపూడి), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తుమ్మపూడిలోని ఎస్సీ శ్మశాన వాటిక ఆవరణలో డ్రెయినేజీ సైడ్‌వాల్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. మండలపరిషత్ అభివృద్ధి నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సైడ్‌వాల్ భూమిపూజలో ఎంపీటీసీ సభ్యురాలు వాసిరెడ్డి లక్ష్మీదేవి, సర్పంచ్ షేక్ అజీజున్, ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, దుగ్గిరాల ఏఎంసీ డైరెక్టర్ బుస్సా నాగరాజు, జల్ది శౌరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కంతేరు రోడ్డుకు మోక్షం లభించేనా..?



పూర్తిగా పాడైపోయిన కంతేరు రోడ్డు

తాడికొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు తాడికొండ - కంతేరు రోడ్డు అధ్వానంగా మారింది. కంతేరు రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలబడి చెరువును తలపిస్తోంది. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా కంతేరు రోడ్డుకు మోక్షం లభించటం లేదు. ఇప్పటికే ఐదారుసార్లు తాడికొండ - కంతేరు రోడ్డు వేసినప్పటికి సంవత్సరం కాలం తిరగకుండా పాడైపోతుంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. రోడ్డు మార్జిన్లు ఎగుడు దిగుడుగా మారాయి. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు భయభ్రాంతులకు గురౌతున్నారు. రోడ్డు వేసే కాంట్రాక్టర్ నాసి రకంగా పనులు చేయటం వల్లనే రోడ్డు పాడైపోతుందని వాహనదారులు విమర్శిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న తాడికొండ మండలంలోని పలు రోడ్ల పరిస్థితి ఇదేవిధంగా ఉన్నాయి.

మూడువేల మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరీ ట్రస్టు నిర్వహకులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరీ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక మెట్లమార్గం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు మూడువేలమంది భక్తులు ఈ అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉపేంద్రవర్మ ముఖ్యఅతిథిగా హాజరై ట్రస్టు సేవలను కొనియాడారు. ప్రతీ అమావాస్య దినాన పేదలకు అన్నదానాన్ని నిర్వహించాలన్న ట్రస్టు ఆశయం అభినందనీయమని అన్నారు. 33 మాసాలుగా ఈ ట్రస్టు ప్రతీ అమావాస్యకు అన్నదానాన్ని నిర్వహిస్తూరావడం చాల గొప్ప విషయమని చెప్పారు. ట్రస్టు చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం వెనుక 40 మంది దాతల సహకారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యనమల నరసింహరావు, కర్నాటి సత్యనారాయణ, ఎస్ ప్రసాదు, దుంపల సొమ్ములు, గుద్దింటి మురహరిరావు, పుప్పాల కోటేశ్వరరావు, శ్రీహరి, అన్నపరెడ్డి రామకృష్ణారెడ్డి, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, నంద్యాల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పోలీస్ అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం

● ఎస్పీ వకుల్ జిందాల్



పోలీస్ అమరవీరుల కుటుంబసభ్యులకు జ్ఞాపిక అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి కుటుంబసభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ కుటుంబ సభ్యుల త్యాగాల ఫలితంగానే, పోలీసులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించగలుగుతున్నారన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబసభ్యులకు బహుమతులు అందజేసి, ధైర్యంగా ఉండాలని, పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి (అడ్మిన్), ఏ. హనుమంతు, ఆర్ఐలు సురేష్, శ్రీహరి రెడ్డి, శివ రామకృష్ణ, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత పోలీసు అధికారుల సంఘం

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని మంగళవారం మంగళగిరి ఏపీఎస్‌పి ఆరో బెటాలియన్‌లో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నివాళులర్పించింది. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక స్థూపం వద్ద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ డీజీపీ ఎం.మాలకొండయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఐజీ ఏ.రవిచంద్ర, మాజీ అడిషనల్ ఎస్‌పీ, ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, కోశాధికారి డాక్టర్ కె వి నారాయణ పుష్పగుచ్ఛం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులను ఎప్పటికీ మరువలేమన్నారు.

● దేశంలో ప్రజల ధన, మాన, ప్రాణాల కోసం నిరంతరం రక్షణగా నిలుస్తోన్న పోలీసుల సేవలు చిరస్మరణీయమైనవని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ అన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి



డీఈఓకి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు (విద్య), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 1, 2 కేటగిరి ప్రాంతాల్లోని పాఠశాలలకు, ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్ విజ్ఞప్తి చేశారు ఈ మేరకు డీఈవో సీవీ రేణుకకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. డీఎస్సీ అభ్యర్థులకు ఖాళీలు చూపకపోవడం వల్ల కేటగిరి 1, 2 హైస్కూళ్లలోని విద్యార్థులకు నష్టం జరుగుతుందని, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం.గోవిందు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం



వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయం

వట్టిచెరుకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక విశిష్ట పరమేశ్వరుడిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే మాసం కార్తీకమాసం. మహిళలు ఎంతో నిష్ఠతో తెల్లవారు జాము నుంచే చన్నీటి స్నాన మాచరించి ప్రమిదల్లో నూనె పోసి దీపాలు వెలిగిస్తూ సమీపంలోని కాలువ కట్టలు, చెరువుల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితి. కార్తీక మాసం నేటి సాయంత్రం ఆకాశ దీపం ఆవిష్కరణతో కార్తీక మాసం ప్రారంభమైనట్టుగా చెపుతున్నారు. వట్టిచెరుకూరు గ్రామంలోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో పూజారి కృష్ణ స్వామి, అనంతవరప్పాడు గ్రామంలోని గంగా భ్రమరాంబిక సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో కృష్ణ, ముట్లూరులోని లక్ష్మీచెన్నకేశ స్వామి ఆలయంలో రమణ, లేమల్లెపాడు గ్రామంలో వీరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో డాక్టర్ రమణకుమార్ కార్తీక మాసానికి సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి నిత్యం స్వామి వార్ల పూజా కార్యక్రమాలతో పాటు గోత్ర నామాలతోటి అభిషేకాలు నిర్వహించటం నేటి నుంచి ప్రారంభమవుతాయని డాక్టర్ రమణకుమార్ వెల్లడించారు.

తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో..

తుళ్లూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో కార్తీక మాస మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభవుతాయని శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పేర్కొన్నారు. మంగళవారం క్షేత్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఉత్సవాలు గురించి మాట్లాడారు. భక్తులు స్వయంగా అభిషేకాలు, అర్చనలు కోటిలింగాల స్వామి చేసుకునే భాగ్యం శైవక్షేత్రం ఎప్పటి లాగే కలిగిస్తుందన్నారు. భక్తులకు కార్తీక మాసంలో అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. పౌర్ణమి రోజు జ్వాలా తోరణ కార్యక్రమాలు, ఏకదశి రోజు లక్ష బిల్వార్చ, రుద్రాభిషేకం, భస్మాభిషేకాలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

పేద విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌ల వితరణ




పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న పీవా కేంద్ర కమిటీ సభ్యులు

మంగళగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్మశాలీ వర్గానికి చెందిన ఆరుగురు పేద విద్యార్థినులకు రూ.1.56లక్షల విలువైన రెండు ల్యాప్‌టాప్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. నగరపరిధిలోని కొలనుకొండ వద్దవున్న పద్మశాలీ భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో అసోసియేషన్ మంగళగిరి బ్రాంచి అధ్యక్షులు తాటిపాముల లక్ష్మీపెరుమాళ్లు ఈ ల్యాప్‌టాప్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షుడు సర్గం పుల్లారావు మాట్లాడుతూ లక్ష్మీ పెరుమాళ్లు తన సొంత ఖర్చులతో పేద విద్యార్థినులకు సాయపడడం అభినందనీయమన్నారు. 17 ఏళ్ల కాలంలో చేనేత వర్గానికి చెందిన విద్యార్థులకు మూడు కోట్ల రూపాయల మేర ఆర్థికసాయాన్ని వివిధ రూపాల్లో అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మంగళగిరి బ్రాంచి కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, అసోసియేషన్ మంగళగిరి బ్రాంచి సభ్యులు నందం బాబూరావు, జొన్నాదుల భిక్షారావు, శలా సత్యనారాయణ, జొన్నాదుల నాగమల్లేశ్వరరావు, తుమ్మా సర్వేశ్వరరావు, పంపన సాంబశివరావు, పెనుమల్లి కార్తీక్, మైనంపాటి శ్రీవాస్తవ, కేదాసి శ్రీనివాస్, తాటిపాముల రవి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభలు ఈ నెల 23వ తేదీన మంగళగిరి సీఐటియూ కార్యాలయంలో జరగనున్నాయని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వారికి ఇంతవరకు కొబ్బరినూనె, చెప్పులు, సబ్బులు, రక్షణ పరికరాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వనమా సతీష్, శ్రీను, కామాక్షి, లక్ష్మి, మేరీ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో కెన్నడీ, ఉపాధ్యాయులు

కాకుమాను, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో కొండపాటూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెన్నడీ తెలిపారు. కాకుమానులో జరిగిన ఈ క్రీడా పోటీల్లో పూజిత, లక్ష్మీతులసి, ఖోఖో పోటీలలో ప్రతిభ చూపినట్లు ఆయన తెలిపారు. వరబాబు వాలీబాల్ పోటీల్లో, లోకేష్, నరేష్‌లు కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనపరిచినట్లు చెప్పారు. బుధవారం పెనుమాక జరిగే డివిజనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే ఈ క్రీడాకారులను మంగళవారం ఎంఈవో కెన్నడీ, ఉపాధ్యాయులు ప్రకాశరావు, రాజేష్, రవికుమార్, పోతురాజు, వెంకటేశ్వర్లు, ప్రమీలా, రాజేశ్వరి, స్వామి అయ్యప్ప, షర్మిళలు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

29 నుంచి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలు

గుంటూరు (క్రీడలు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సివిల్ సర్వీస్ పురుషుల, మహిళ ఉద్యోగుల క్రీడా పోటీలు స్థానిక బీఆర్‌స్టేడియంలో ఈనెల 29 నుంచి జరగనున్నాయి. రెండు రోజులు పాటు జరగనున్న ఈ పోటీలలో మొదటి రోజు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్ క్రీడాంశాలలో, రెండవ రోజు హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, యోగ, రెజ్లింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డాన్స్‌లలో పోటీలు జరుగుతాయి. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను నవంబరు 5 నుంచి 8 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర జట్టు తరుపున జాతీయ సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలలో పాల్గొంటారు. ఈ పోటీలలో పాల్గొనే సివిల్ సర్వీస్ ఉద్యోగులు తమ గుర్తింపు కార్డులతో ఉదయం 9 గంటలకు జిల్లా క్రీడాభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పి.అఫ్రోజ్ పేర్కొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మంగళవారం పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని కొప్పురావూరు శివారులోని పాత రేకులు షెడ్డులో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆకస్మిక దాడిచేశారు. టాస్క్ ఫోర్స్ సిబ్బందికి అందిన సమాచారాన్ని ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్ జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్ళి ఎస్పీ ఆదేశాల మేరకు దాడి చేసారు. పెదకాకాని పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలసి పేకాట ఆడుతున్న 12మందిని, 11 సెల్ ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలు, రూ.69వేల250 నగదు సీజ్‌చేసి పెదకాకాని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఘనంగా దీపావళి సంబరాలు

తెనాలి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో దీపావళి సంబరాలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కుల మతాలకు అతీతంగా దీపావళి బాణసంచా కొనుగోలు చేసి పిల్లలు, పెద్దలు ఆనందంగా గడిపారు. ఇళ్లను, దుకాణాలను ప్రజలు వ్యాపారులు విద్యుత్ దీపాలు, తోరణాలతో, పూలతో అలంకరించారు. బాణాసంచా విక్రయాలకు ముందు రోజు వర్షం బెంబేలెత్తించగా పండుగరోజు మాత్రం ఎండ రావడంతో వ్యాపారులు ఆనందంగా బాణసంచా విక్రయించుకున్నారు. వీఎస్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. సాయంత్రం 7 గంటల నుంచి పట్టణంలో బాణసంచా మోతలు అర్ధరాత్రి 12 గంటల వరకు మిన్నంటాయి.

రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే...

దీపావళి పండుగ పురస్కరించుకుని పట్టణంలో పలు ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయింది. సోమవారం రాత్రి ప్రతి వీధిలో పెద్ద ఎత్తున దీపావళి టపాసులు వెలిగించారు. బాణసంచా అట్టలు, వ్యర్థాలతో వీధులు నిండిపోయాయి. మంగళవారం అన్ని వీధుల్లో మున్సిపల్ సిబ్బంది వ్యర్థాలను తొలగించలేకపోయారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లోని వీధుల వెంట సైతం బాణసంచా వ్యర్థాలు ఉండిపోయాయి. పట్టణంలో గతంలో ప్రతి వీధిని ప్రతిరోజు శుభ్రం చేసేవారు. గత కొంత కాలంగా ఈ అనవాయితీ తగ్గిపోయింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ పట్టణ పారిశుధ్యంపై దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు.


దగ్ధం అవుతున్న వైర్లు

మారీసుపేటలో బాణసంచాతో వైర్లు దహనం

తెనాలి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారీసుపేటలో బాణసంచా పడి ఓ విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న వైర్లుకు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. పెద్దఎత్తున మంటలు రావడంతో స్థానికులు మంటలను అదుపు చేశారు. విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న వైర్లకు సోమవారం రాత్రి బాణసంచా నిప్పురవ్వలు పడి మంటలు వచ్చాయని, వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. సకాలంలో స్పందించడంతో ప్రమాదం తొలగింది.

శైవాలయాలకు కార్తీక శోభ

పొన్నూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణ, మండలంలోని శైవాలయాలు కార్తీక శోభనను సంతరించుకున్నాయి. కార్తీక మాస ప్రారంభం సందర్భంగా నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు శైవాలయాలను ఆలయాల నిర్వాహకులు సిద్ధం చేశారు. తొలి రోజు పాడ్యమి సందర్భంగా మహిళలు దీపారాధనలు చేశారు. పొన్నూరు పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీసహస్రలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు జరిగాయి. ఆలయంలోని 1008 శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు విశేష అభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించేలా ఏర్పాట్లు జరిగాయి. అలాగే పట్టణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, పాత పొన్నూరులోని బాలకోటేశ్వర స్వామి ఆలయం, నిడుబ్రోలు చౌడేశ్వరస్వామి ఆలయం చింతలపూడి మల్లేశ్వర స్వామి ఆలయం, మామిళ్ళపల్లి అగస్త్యేశ్వర స్వామి ఆలయం, వల్లభరావుపాలెం ఓంకారేశ్వరస్వామి ఆలయం, ములుకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయం, తదితర శైవాలయాల్లో కార్తీక మాస పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. వేకువ జాము నుంచే మహిళలు ఆలయానికి తరలివచ్చి దీపారాధనలు చేసుకునే లా ఏర్పాట్లును చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

తెనాలి క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమసుందరపాలెంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఉయ్యూరు శంకరరావు గ్రామంలో మద్యం బాటిల్స్ అమ్మకాలు సాగిస్తున్నాడన్న సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది నిఘా ఉంచి అతని వద్ద 13 అక్రమ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆ బాటిల్ మూతలపై ఉండే సీల్‌ను తొలగించాడు. దీంతో అవి ఎక్కడ నుంచి తెచ్చింది తెలిసే అవకాశం లేదని ఎస్ఐ ఫణికుమార్ చెప్పారు. కాగా మద్యం బాటిల్స్ పట్టివేతపై పట్టణంలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. కల్తీ మద్యం పట్టుబడిందనే ప్రచారం సాగింది. దీనిని ఎక్సైజ్ అధికారులు ఖండించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు పండుగలు

● రాష్ట్ర మంత్రి మనోహర్ ● తెనాలి క్యాంపు కార్యాలయంలో దీపావళి సంబరాలు


క్యాంపు కార్యాలయంలో దీపావళి పూజల్లో పాల్గొన్న మంత్రి మనోహర్ దంపతులు, కుటుంబ సభ్యులు

తెనాలి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలు పండగలు అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి బోసురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం పండుగ సంబరాలు కుటుంబ సభ్యులు, పార్టీశ్రేణులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. పార్టీ కార్యాలయాన్ని, ఆవరణను పూలతో, అరటి చెట్లు, దీపాలతో అలంకరించారు. ఆవరణలో ముగ్గులు వేసి దీపావళి పూజలు చేశారు. బాణసంచా వెలిగించారు. మంత్రి మనోహర్‌తో పాటు ఆయన సతీమణి మనోహరం, కుమారుడు వేడుకల్లో పాల్గొన్నారు. కార్యకర్తలకు, నాయకులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఆవరణలో దీపావళి ప్రమిదలు వెలిగించి పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల జీవితాల్లో దీపావళి పండుగ వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అందరూ కలిసిమెలిసి రాష్ట్ర అభివృద్ధిలో సంక్షేమంలో పాటు పడదామని, తద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్వల భవిష్యత్తు అందిద్దామన్నారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నిర్లక్ష్య వైఖరి సహించం

ఎమ్మెల్యే ధూళిపాళ్ళ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సంబంధిత సమస్యలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల వారీగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వచ్చిన అర్జీలు వాటి పరిష్కారం వివరాలపై సమీక్షించారు. పలు సమస్యలపై రైతులు తనకు అందజేసిన ఫిర్యాదుల గురించి గ్రామాల వారీగా వివరణ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రైతులు, ప్రజలతో అమర్యాదగా వ్యవహరిస్తే సహించబోయేది లేదని హెచ్చరించారు. ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను కాల పరిమితిలో పరిష్కరించాలని రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే రీ సర్వే జరిగిన గ్రామాలలో జరిగిన సమస్యల పరిష్కార అర్జీల గురించి ఆరా తీశారు. అయితే రీ సర్వే జరిగిన గ్రామాల్లో కూడా ఇంకా భూ సమస్యలు వస్తున్నాయని వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. పొన్నూరు పట్టణంలో ఎస్‌వీపీ రోడ్డు, సాంబశివనగర్ కాలనీ ప్రాంతాలు దేవదాయ శాఖ పరిధిలో ఉన్నందున 22ఎ కింద రిజిస్టర్ చేశారని రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే ఈ భూములపై నివేదిక రూపొందించి అందజేయాలని అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో స్మశాన పోరంబోకులో ఉన్న నివేశన గృహాలపై కూడా నివేదిక రూపొందించి అందజేయాలని ఆదేశించారు. ప్రజలను సమస్యల పేరుతో తిప్పుకొని ఇబ్బందులు పెడితే తరువాత పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. 22ఏ సమస్య ఉన్న రైతుల భూములు సమస్యలకు రెవెన్యూ అధికారులే చొరవ చూపి పరిష్కారం చూపాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తుందని అయితే అది అత్యధికంగా భూమి రికార్డులు అందుబాటులో లేనందున లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేందుకు పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జియావుల్ హక్, డిప్యూటీ తహసీల్దార్ మాధవి, ఆర్ఐ రామారావు శ్రీనివాస్, రెవెన్యూ విభాగాల సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

బాలుడిపై దాడిని అడ్డుకున్నారన్న కక్షతో దాడి


దాడిలో తీవ్రంగా గాయపడిన రహమాన్

తెనాలి క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలుడిపై దాడి చేస్తుండగా అడ్డుకున్నందుకు ఓ కుటుంబంపై యువకులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం రాత్రి స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో చోటు చేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రబాబు నాయుడు కాలనీలో నివాసం ఉండే 13 సంవత్సరాల బాలుడు రాఘవను అదే ప్రాంతానికి చెందిన యువకులు రకరకాల పనులు పురమాయిస్తుండటంతో బాలుడు వారు చెప్పిన పని చేసేందుకు తిరస్కరించాడు. దీంతో రాఘవపై ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో హన్ను, తిరుపతి, నాంచారయ్య, సన్ని అనే యువకులు దాడి చేస్తున్నారు. గమనించిన బాలుడి ఇంటి సమీపంలో ఉండే ఆటోడ్రైవర్ షేక్ రహమాన్, అతని కుటుంబ సభ్యులు ఆ బాలుడిని వారి నుంచి కాపాడారు. దీనిని అవమానంగా భావించిన యువకులు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో రహమాన్ ఇంటిపై కర్రలు, బీరు బాటిళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో రహమాన్‌తో పాటు అతని తల్లి, భార్య, పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇదే సమయంలో చుట్టుపక్కల వారు రావడంతో ఆ యువకులు పరారయ్యారు. బాధితులను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.


అత్తోటలో సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

సచివాలయం సిబ్బంది నిబంధనలను పాటించాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తోట, చివలూరు సచివాలయాలను ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని లేకపోతే తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.


రైతులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

25న జరిగే పాల రైతుల సంఘం

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీన తెనాలిలో పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాసభను రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుంచవరం, అత్తోట యాదవపాలెం, సిరిపురం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు బ్రహ్మేశ్వర రావు, నాగరాజులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా పాడి రైతులకు లీటరుకు రూ.8 నుంచి రూ 10ల వరకు ప్రోత్సాహక ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పాడి పశువులను మేపాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. పాలధర కంటే పశువులకు అందించే దాణా ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. పాడి పరిశ్రమను కాపాడుకునేందుకు తెనాలిలో ఉదయం 10 గంటలకు నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కల్యాణ మండపంలో జరిగే ప్రథమ జిల్లా మహాసభకు రైతులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగపుణ్యేశ్వరరావు, డి.గోపయ్య, టి.పాములు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రియకు కలెక్టర్ అభినందనలు


విద్యార్థి సుప్రియను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ

పొన్నూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలలో ప్రతిభ చూపిన మాచవరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి జే సుప్రియకు కలెక్టర్ ప్రశంసలు దక్కాయి. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఈ నెల 11వ తేదీన మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలలో జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న వందలాది మంది విద్యార్థులతో పోటీపడి మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన జే సుప్రియ ప్రతిభ చూపి ద్వితీయ స్థానాన్ని సాధించింది. ప్రతిభ చూపిన బేబీ సుప్రియకు మంగళవారం కలెక్టర్ ప్రశంసాపత్రం అందజేసి రూ.3వేల నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ మహబూబ్‌బాషా, గైడ్ టీచర్ పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు గ్రామ ప్రముఖులు సుప్రియను అభినందించారు.

అనధికారిక కట్టడాల గుర్తింపునకు సర్వే

● రంగంలోకి 47 బృందాలు


సర్వే బృందాలతో చర్చిస్తున్న అధికారులు

తెనాలి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో అనధికారిక కట్టడాల గుర్తింపునకు రెండు రోజుల సర్వే చేపట్టారు. ఇందుకోసం మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో సీఆర్‌డీఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్.మధుసూదనరావు, టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ పి.మధుకుమార్‌లు సమావేశం నిర్వహించారు. మంగళ, బుధ వారాల్లో సర్వే నిర్వహించి అనధికార నిర్మాణాలను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మధుసూదనరావు పేర్కొన్నారు. 16మంది అధికారులు పర్యవేక్షణ చేస్తూ 47బృందాలను తనిఖీలకు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బృందంలో ముగ్గురు నుంచి నలుగురు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బందిని నియమించారు. సర్వే అనంతరం వివరాలను ప్రకటిస్తామని తెలిపారు.


సంఘ నాయకులను సన్మానిస్తున్న నాగరాజు

దళితవర్గాల సంక్షేమానికి కృషి: నాగరాజు

తెనాలి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దళిత వర్గాల సంక్షేమానికి మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం కృషి చేస్తుందని రాష్ట్ర సంఘ వ్యవస్థాపకుడు సుద్దపల్లి నాగరాజు చెప్పారు. పట్టణంలోని మహాత్మాగాంధీ కాంప్లెక్స్ సంఘ నాల్గో వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కూచిపూడి మోహన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొక్కిలిగడ్డ సునీల్, కో-ఆర్డినేటర్‌గా కోట్ల దిలీప్, జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడిగా ఉన్నం భూషణం, జిల్లా అధ్యక్షుడిగా లింగాల రమేష్, నియోజకవర్గ అధ్యక్షుడిగా రావూరి సతీష్‌లను నియమించి సన్మానించారు. 20ఏళ్లుగా సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీధర్, సన్ని, ఉదయ్, చందు పాల్గొన్నారు.

ఆరోగ్య విస్తరణాధికారుల సంఘ అధ్యక్షుడిగా పున్నారెడ్డి


పున్నారెడ్డిని సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

తెనాలి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య విస్తరణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వంగల పున్నారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఉమాకాంత్, బాలచంద్రమౌళి, సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. రవికుమార్, మల్లేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, శివరాంప్రసాద్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

చట్ట పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

● పోలీసు అమరవీరుల సంస్మరణలో డీఎస్పీ జనార్దనరావు

తెనాలి క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని, సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీసుల పాత్ర కీలకమైనదని డీఎస్పీ బి.జనార్ధనరావు పేర్కొన్నారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా చెంచుపేటలోని ఐపీఎస్ ఉమేష్‌చంద్ర కాంస్య విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఉమేష్‌చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తీవ్రవాదం, ఉగ్రవాదం, అరాచక శక్తులు, మత తత్వవాదులను ఎదుర్కోండంలో ఎందరో పోలీసులు అమరులయ్యారని, అమర వీరుల త్యాగాలు మరువలేనివని, వారి నుంచి స్ఫూర్తి ప్రేరణ పొందుతామని డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమేష్‌చంద్ర కుటుంబీకులు జాస్తి భుజంగరావు, రావెళ్ల మురళీకృష్ణ, బ్రహ్మయ్య, ఉమామహేశ్వరరావు, కోటేశ్వరరావు, పట్టణ సీఐలు సాంబశివరావు, మల్లికార్జునరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, తదితరులు

ఎఫ్‌పీవోలతో రైతన్నల అభ్యున్నతి


● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీతో రైతుల అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని మునిపల్లెలో సోమవారం డీవీసీ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ద్వారా మండలంలోని 45మంది లబ్ధిదారులకు తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌ని 2023లో ప్రారంభించినట్లు చెప్పారు. ఈ ఎఫ్‌పీవో ద్వారా రైతుల అవసరాలు తీర్చేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. సొసైటీ విధానంలో ఏర్పడిన ఈ ఎఫ్‌పీవోలో ఇప్పటికే వందలాది మంది రైతులు భాగస్వాములయ్యారన్నారు. ఎఫ్‌పీవోతో రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించనున్నట్లు తెలిపారు. అలాగే త్వరలోనే గోదాముల సౌకర్యం కల్పించి రైతుల ఉత్పత్తులు నిల్వ ఉంచుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఎఫ్‌పీవో ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఎఫ్‌పీవోకు సొంత భవనం సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందించే ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, కూటమి పార్టీల నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ


ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌తో విద్యార్థులు

చేబ్రోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడూరులో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) కోసం శిక్షణ పొందుతున్న 27 మంది విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. లక్ష్మణరావు ఉచిత మెటీరియల్ అందచేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు జాన్‌బాబు, ఉదయభాస్కర్ పాల్గొని విద్యార్థులకు మెటీరియల్ అందజేశారని ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు తెలిపారు. ఈ మెటీరియల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సాధనలో ఎంతో తోడ్పడుతుందని, అందరూ దీన్ని సమర్థంగా వినియోగించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిచేందుకు చెకుముకి సంబరాలలో భాగంగా సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ 'ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్' అనే నినాదంతో ముందుకు సాగాలని, విద్యార్థులు మూఢ నమ్మకాలను వదిలి శాస్త్రీయంగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో జాన్‌బాబు, భాస్కర్, హరిప్రసాద్, ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరావు, జె. విశ్వేశ్వరరావు, కె. ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ రైతు యర్రు స్వాతిని అభినందిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి

కొల్లిపర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని చిన్న, చిన్న వ్యాపారాలతో జీవనోపాధిని పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో యానిమేటర్లు, గ్రామ సమాఖ్య ప్రతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు మునగాకు, కొరమేను, పెరటికోళ్ల పెంపకం వంటివి అభివృద్ధి చేసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయటానికి స్త్రీనిధి, సామాజిక పెట్టుబడి నిధి, బ్యాంకుల లింకేజీ ద్వారా నిధులను అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా పీజీఎస్ నాచురల్ పార్మా సర్టిఫికేట్‌ను అందుకున్న యర్రు స్వాతిని డీఆర్‌డీఏ అధికారులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీడీ కిరణ్‌కుమార్, డీపీఎం బి.శివప్రసాదరెడ్డి, బ్యాంకులింకేజీ డీపీఎం కేశవకుమార్, స్త్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్‌రెడ్డి, ఏపీఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.